శనివారం
29-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 38
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మరిగే యుగంలోకి అడుగు పెట్టాం

గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసిందని, మరిగే యుగంలోకి అడుగుపెట్టామంటూ ఆందోళన వెలిబుచ్చారు. రికార్డు స్థాయిలో ధ్వంసమయ్యే ఉష్ణోగ్రతలు భూమిని వేడెక్కిస్తూ వచ్చాయని, ఇక నుంచి సలసల మరిగే పరిస్థితులను ఎదుర్కొబోతున్నాం అని వ్యాఖ్యానించారు.

2 లో

మునేరు మహోగ్రం

- రెండోరోజూ హైవేపై రాకపోకలు బంద్
- ప్రకాశం బ్యారేజీకి రెండున్నర లక్షల వరద ప్రవాహం
- 26 గంటల తర్వాత వాహన రాకపోకలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మునేరు మహోగ్ర రూపం దాల్చింది. ప్రమాదస్థాయిని మించి పరవళ్లు తొక్కుతోంది. ఎన్‌టీఆర్ జిల్లా కీసర వంతెన సమీపంలో ఐతవరం గ్రామం వద్ద వరద నీరు రోడ్డుపైకి రావడంతో విజయవాడ- హైదరాబాద్ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మునేరు రెండు అడుగుల ఎత్తున పొంగుతోంది. దీంతో గురువారం సాయంత్రం 4.30 గంటల నుంచి వాహన రాకపోకలను నిలిపివేశారు. లారీలు, బస్సులు, భారీ వాహనాలు రోడ్డుకి రెండువైపులా కిలోమీటర్ల పొడవునా నిల్చిపోయాయి. కార్లు మాత్రం మధిర నుంచి విజయవాడకు చేరుకున్నాయి. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను కంచికచర్ల, ఎర్రుపాలెం, మధిర మీదుగా మళ్లించారు. భారీ వాహనాలను ఇబ్రహీంపట్నం, తిరువూరు, కల్లూరు రూటుకు మళ్లించారు. తెలంగాణ ఆర్టీసీ మాత్రం గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళు తున్నాయి. ప్రయాణికులు ఇబ్బందికి గురికాకుండా తెలంగాణ ఆర్టీసీ చర్యలు తీసుకున్నది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మునేరుకు తీవ్రస్థాయిలో వరద రావడంతో వాహనదారులు, బస్సుల్లో ప్రయాణించేవారు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు ఎక్కువగా నష్టపోయారు. ఏటికి రెండు వైపులా ఉన్న అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. నందిగామ మండలం కంచల గ్రామాన్ని వరద పూర్తిస్థాయిలో

- మిగతా 2 లో

వరద తగ్గుముఖం-వాహన రాకపోకలు పునరుద్ధరణ

శుక్రవారం సాయంత్రానికి మునేరు కొంత శాంతించింది. వరద క్రమేపీ తగ్గుముఖం పట్టడంతో విజయవాడ-హైదరాబాద్ రూటులో వాహనరాకపోకలను పునరుద్ధరించారు. మొదట హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను అనుమతించారు. ఆ తర్వాత హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పంపించారు. పోలీసులు దగ్గరుండి ఒక్కొక్క వాహనాన్ని జాగ్రత్తగా వరద పారే ప్రాంతాన్ని దాటించారు. దాదాపు 26 గంటల తర్వాత నిత్యం రద్దీగా ఉండే విజయవాడ –హైదరాబాద్ హైవేపై వాహన రాకపోకలు పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

వరద బాధితులకు అండగా నిలవాలి

3 లో

తక్షణ సాయంగా రూ.2 వేలు, నిత్యావసరాల పంపిణీ
కచ్చా ఇళ్లకు రూ.10 వేల నష్టపరిహారం: సీఎం జగన్

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న విలీన మండలాల ముంపు బాధితులు

విలీన మండలాల మునక

- కూనవరం, ఎటపాక వద్ద గోదావరి ఉధృతి
- ముంపులో అనేక గ్రామాలు... నిలిచిన రాకపోకలు
- సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న వరద బాధితులు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

విశాలాంధ్ర–చింతూరు/కూనవరం : విలీన గ్రామాల ప్రజలు మళ్లీ వరద ముంపులో చిక్కుకున్నారు. శబరి, గోదావరి సంగమ స్థానమైన అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం గోదావరి వరద 50 అడుగులకు చేరుకోగానే అనేక కాలనీలు నీట మునగడంతో మండల కేంద్రమైన కూనవరం దాదాపు ఖాళీ అయింది. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత ఏడాది వరద కష్టాలు తీరక ముందే మళ్లీ వరదలొచ్చాయి. గత ఏడాది 70 అడుగుల మేర గోదావరి వచ్చినప్పుడు కనీసం కన్నెత్తి చూడని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ దఫా కూడా అదే రీతిలో వ్యవహరిస్తోంది. గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉండి ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌లో విలీనమైన ఎటపాక, చింతూరు, వర రామచంద్రాపురం, కూనవరం మండలాల ప్రజల

- మిగతా 2 లో

రేపే పీఎస్‌ఎల్‌వీసి-56 రాకెట్ ప్రయోగం

ఉదయం 6:30 నిమిషాలకు నింగిలోకి..

విశాలాంధ్ర –సుళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి రేపు ఉదయం పీఎస్ఎల్వీసీ-56 రాకెటును ప్రయోగించనున్నారు. శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ఈ సందర్భంగా 422 కిలోల బరువు కలిగిన సింగపూర్‌కి చెందిన ఏడు ఉపగ్రహాలను అమర్చి ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 6 గంటల 30 నిమిషాలకు పీఎస్ఎల్‌వీసీ షార్ నుంచి నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి పయనించనుంది. 351

- మిగతా 2 లో

ఇండియాను చీల్చడానికే...

ఈడీ పదవీకాలం పొడిగింపుపై విపక్షాల మండిపాటు

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ) డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలం పొడిగింపుపై రాజకీయ దుమారం చెలరేగింది. సెప్టెంబరు 15వ తేదీ వరకు సంజయ్‌కుమార్ మిశ్రా పదవీకాలం పొడిగించిన కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే మిశ్రా పదవీకాలాన్ని మోదీ సర్కారు పొడిగించిందని మండిపడ్డాయి. విపక్ష కూటమి 'ఇండియా'ను బలహీనపర్చడానికిగాను తప్పుడు కేసులతో విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడానికే మోదీ సర్కారు ఈ బరితెగింపు నిర్ణయం తీసుకుందని ఆరోపించాయి. ఈడీ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు అత్యవసరమని, ఆయన నాయకత్వంలో కొనసాగుతున్న కేసులు అనేకం ఇంకా పెండింగ్‌ల ఉన్నాయని మోదీ సర్కార్ తెలపడంతో ఆయన పదవీకాలాన్ని సెప్టెంబరు 15వ తేదీ అర్ధరాత్రి వరకు పొడిగిస్తూ సుప్రీంకోర్టు గురువారం తీర్పు ఇచ్చిన విషయం విదితమే. అదేసమయంలో ఈడీ డైరెక్టర్‌గా నియమించడానికి మిశ్రా కన్నా సమర్థులు ఇంకెవరూ లేరా అని సుప్రీంకోర్టు కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. ఈడీ పదవీకాలం పొడిగింపుపై విపక్ష నేతలు పార్లమెంటు బయట సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝూ మాట్లాడుతూ అక్రమం, చట్టవిరుద్ధమైనప్పటికీ మిశ్రా పదవీకాలాన్ని కేంద్రం పొడిగించిందని విమర్శించారు. ఇది ముమ్మాటికీ రాజకీయ దురుద్దేశమేనని స్పష్టంచేశారు. అబద్ధాలు ప్రచారం చేయడం ద్వారా విపక్ష కూటమి 'ఇండియా'ను చీల్చడానికి బీజేపీ విశ్వప్రయత్నం చేస్తోందని

- మిగతా 2 లో

శాంతి పునరుద్ధరణే లక్ష్యం

- నేడు మణిపూర్‌కు 'ఇండియా' ఎంపీల బృందం
- క్షేత్రస్థాయిలో పరిశీలన... ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం
- విపక్ష నేతల వెల్లడి

న్యూఢిల్లీ: క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసేందుకుగాను విపక్ష కూటమి 'ఇండియా' ఎంపీల బృందం శనివారం మణిపూర్ వెళ్లనున్నది. ఈ బృందం రెండు రోజులు రాష్ట్రంలో పర్యటిస్తుంది. అక్కడి పరిస్థితులన్నీ క్షుణ్ణంగా పరిశీలించి... మణిపూర్‌లో నెలకొన్న సమస్యకు పరిష్కారం

- మిగతా 2 లో

హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

హాజరైన జగన్, చంద్రబాబు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి (పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాలనాయుడు, హోంశాఖ మంత్రి తానేటి వనిత, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, డిప్యూటీ చైర్మన్ జకియా ఖానమ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కి పుష్పగుచ్ఛం ఇచ్చి సీఎం జగన్ అభినందనలు తెలిపారు. ప్రతిపక్ష నేత

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గాయి!

ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని

సవరించే యోచన లేదు

పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించే ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో తెలిపింది. ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులు పార్టీ ఫిరాయించకుండా నిరోధించేందుకు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో నిబంధనలు పొందుపరిచారు. పదో షెడ్యూల్‌ని కానీ, ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కానీ సవరించే ఆలోచన ఏదీ లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ శుక్రవారం ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిస్తూ తెలిపారు. చట్ట సవరణపై లోక్‌సభ స్పీకర్ గత జులైలో నిర్వహించిన ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదని తెలిపారు. చట్టాన్ని అధ్యయనం చేసేందుకు నియమించిన కమిటీ సభ్యుల్లో రెండు భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సభాపతికి మరిన్ని అధికారాలు కల్పించాలని మెజారిటీ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షుడికి అధికారం కల్పించాలని మరికొంత మంది సభ్యులు సూచించారు. ఒక పార్టీ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు మరో పార్టీలోకి ఫిరాయిస్తున్న ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినతరం చేయాలన్న డిమాండు ఇటీవల కాలంలో ఎక్కువైంది.

గుండ్రేవులపై ఇంత నిర్లక్ష్యమా?

- ఏళ్లు గడుస్తున్నా ముందుకు కదలని పనులు
- ప్రాజెక్టు పూర్తయితే కేసీ కెనాల్ ఆయకట్టు పూర్తిగా స్థిరీకరణ
- పాలకుల తీరుపై సీమ రైతుల ఆగ్రహం

గుండ్రేవుల వద్ద ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, ముప్పాళ్ల, ఓబులేసు, హరినాథరెడ్డి, వనజ, రామచంద్రయ్య, జగదీశ్, రామాంజనేయులు, గిడ్డయ్య, ఇతర నేతలు (ఫైల్‌ఫోటో)

విశాలాంధ్రబ్యూరో– కర్నూలు: కర్నూలు, కడప జిల్లాల రైతుల జీవనాడి గుండ్రేవుల ప్రాజెక్టు. అది పూర్తయితే కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత బీడు భూములు సస్యశ్యామలమవుతాయి. కర్నూలు-కడప కాలువ కింద ఉన్న ఆయకట్టుకు సరిపడా నీరు ఇవ్వొచ్చు. తాగునీటి ఇబ్బందుల నుండి కర్నూలు నగర ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించడంతోపాటు గూడూరు, సి.బెళగల్, కోడుమూరు, కర్నూలు మండలాల్లో బీడు భూములు పంటలకు అనువుగా మారతాయి. రెండు జిల్లాలకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టు ఆరంభంలోనే ఆగిపోయింది. ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా నిధులు ఇవ్వక ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. పాలకులు ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టడం

- మిగతా 2 లో

మరిగే యుగంలోకి అడుగు పెట్టాం

- గ్లోబల్ వార్మింగ్ ముగిసిన అధ్యాయం
- పర్యావరణ మార్పులపై ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ ఆందోళన

న్యూయార్క్: పర్యావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. 1,20,000 సంవత్సరాల్లో ఈ జులై నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని శాస్త్రవేత్తలు అధికారికంగా ప్రకటించారు. న్యూయార్క్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ పరిణామంపై గుటెర్రెస్ మాట్లాడుతూ... గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసిందని, మరిగే యుగంలోకి అడుగుపెట్టామంటూ ఆందోళన వెలిబుచ్చారు. రికార్డు స్థాయిలో ధ్వంసమయ్యే ఉష్ణోగ్రతలు భూమిని వేడెక్కిస్తూ వచ్చాయని, ఇక నుంచి సలసల మరిగే పరిస్థితులను ఎదుర్కొబోతున్నాం అని వ్యాఖ్యానించారు. ఇప్పటిదాకా గ్లోబల్ వార్మింగ్ గురించే ఆందోళన చెందుతూ వచ్చాం కానీ... ఇక దాని గురించి ఆలోచన అక్కర్లేదు. ఎందుకంటే భూమి ఇప్పటికే వేడెక్కిపోయింది... ఇక నుంచి భూమి సలసల మరిగిపోతుందన్నారు. ఉత్తరార్థ గోళంలో నమోదు అవుతున్న తీవ్రమైన వేడిని... అత్యంత క్రూరమైన వేసవిగా అభివర్ణించారాయన. ఇది భూగ్రహానికి వచ్చిన విపత్తు అని, మంచు యుగం నుంచి చూసుకుంటే... ఈ జులైలో ప్రపంచ స్థాయి ఉష్ణోగ్రతలతో రికార్డులు బద్దలయ్యాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పు ఊహకందని వేగంలో జరిగిపోయింది. ఇక భయంకర పరిణామం... ఆరంభం అయ్యిందనే అనుకోవాలి. ఇంక హెచ్చరికలు ఉండవు... త్వరపడి చర్యలు చేపట్టాలంతే అని ప్రపంచ నేతలకు పిలుపు ఇచ్చారాయన.

విశాలాంధ్ర ప్రపంచం

సిరియాలో భారీ పేలుడు: ఆరుగురి మృతి

దమాస్కస్: రాజధాని దమాస్కస్‌కు దక్షిణంగా ఉన్న షియా ముస్లింలకు చెందిన ప్రార్థనా మందిరం సమీపంలో బాంబు పేలుడు సంభవించింది. ఈ బాంబు పేలుడు ఘటనలో ఆరుగురు మరణించారు. మరో 20 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అధికారులు స్థానిక ఆస్పత్రులకు తరలించారు. అయితే, గాయపడిన వారిలో అనేకమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. సిరియాలో అత్యధికంగా సందర్శించే షియా పుణ్యక్షేత్రమైన సయేదా జైనాబ్ సమాధి సమీపంలో అషురాకు ఒకరోజు ముందు ఈ బాంబు పేలుడు సంభవించింది. ఇది ఉగ్రవాదుల బాంబు దాడి అని సిరియా అధికారులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కారులో బాంబు పెట్టడం వల్ల పేలుడు సంభవించిందని స్టేట్ టెలివిజన్ నివేదించింది. ఒక్కసారిగా భారీ పేలుడు శబ్దం రావడంతో సమీపంలోని ప్రజలు పరుగులు తీశారు. పేలుడు జరిగిన వెంటనే ఘటనా స్థలికి అంబులెన్సులు చేరుకోవడంతో భద్రతా దళాలు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించాయి. మహమ్మద్ ప్రవక్త మనవరాలు, ఇమామ్ అలీ కుమార్తె అయిన సయిదా జీనాబ్ సమాధి నుండి 600 మీటర్ల దూరంలో ఉన్న భద్రతా భవనం సమీపంలో ఈ పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. బాంబు పేలుడు దాటికి సమీపంలోని షాపుల అద్దాలు పగిలిపోయాయి. మంటలు చెలరేగడంతో ప్రజలు భయంతో పరుగులు తీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా ఆ ప్రాంతంలోని భవనాలపై ఆకుపచ్చ, ఎరుపు, నలుపు అషూరా జెండాలు, బ్యానర్లు వేలడదీశారు. అషురా అనేది ఇస్లామిక్ నెల మొహర్రం 10వ రోజు. ఇది షియా ముస్లింలకు అత్యంత పవిత్రమైన నెలల్లో ఒకటి. ఇది ప్రస్తుత ఇరాక్ లో ఏడవ శతాబ్దంలో కర్బలా యుద్ధంలో ప్రవక్త మహమ్మద్ మనవడు ఇమామ్ హుస్సేన్, అతని 72 మంది సహచరుల అమరవీరత్వాన్ని సూచిస్తుంది.

డ్రగ్స్ కేసులో మహిళకు ఉరి

సింగపూర్: మాదకద్రవ్యాల కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న 45ఏళ్ల సారిదేవి జమానిని శుక్రవారం సింగపూర్‌లో ఉరి తీశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఆ దేశంలో ఓ మహిళను ఉరితీయడం ఇదే మొదటిసారి. 2018లో సుమారు 30 కేజీల హెరాయిన్‌ను సరఫరా చేస్తూ ఆమె పట్టుబడింది. గత వారం రోజుల్లో మరణ దండన ఎదుర్కొన్న రెండవ డ్రగ్ నేరస్తురాలు ఆమె. సింగపూర్‌లో డ్రగ్స్ నివారణ కోసం కఠినమైన చట్టాలను అమలు చేస్తున్నారు. దాదాపు 15 కేజీల హెరాయిన్ దొరికిని కూడా... అలాంటి నిందితులకు సింగపూర్‌లో మరణశిక్ష అమలు చేస్తారు.

2018 జులై ఆరవ తేదీన సారిదేవికి మరణశిక్ష విధించినట్లు సింగపూర్‌కు చెందిన సెంట్రల్ నార్కోటిక్స్ బ్యూరో పేర్కొంది. అయితే చట్ట ప్రకారమే ఆమెను ఉరితీసినట్లు జైలు అధికారులు వెల్లడించారు. ఆమె పెట్టుకున్న క్షమాభిక్ష అభ్యర్థనను కొట్టిపారేశారు. రెండు రోజుల క్రితం అజీజ్ అనే వ్యక్తిని కూడా ఉరితీశారు. 2017లో 50 కేజీల హెరాయిన్‌తో అతను పట్టుబడ్డాడు.

అఫ్గాన్‌లో 'నెక్‌టై'పై నిషేధం?

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో మెడకు కట్టుకునే 'టై'లపై నిషేధం విధించేందుకు అక్కడి తాలిబన్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే అక్కడ బ్యూటీ పార్లర్లు, సెలూన్లపై నిషేధం అమలవుతోంది. ఇప్పుడు నెక్‌టైలపై నిషేధం విధించేందుకు సిద్ధమయ్యారు. నెక్‌టైలు క్రైస్తవ శిలువను పోలి ఉండటమే ఇందుకు కారణం! ఈ విషయాన్ని 'ది ఇన్విటేషన్ అండ్ గైడెన్స్ డైరెక్టరేట్' డైరెక్టర్ మొహమ్మద్ హాషిమ్ షాహీద్ వ్రార్ వెల్లడించారు. అఫ్గాన్‌లో మతపరమైన విధానాలను నిర్ణయించే స్వతంత్ర సంస్థ ది ఇన్విటేషన్ అండ్ గైడెన్స్ డైరెక్టరేట్. టెలివిజన్ ప్రసంగంలో షాహీద్ వ్రార్ మాట్లాడుతూ... 'కొన్ని సార్లు నేను హాస్పిటల్స్, ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ముస్లిం యువకులు నెక్‌టైలు ధరించడం చూశా. నెక్‌టైలకు మూలం ఏంటి? క్రైస్తవ శిలువ' అని పేర్కొన్నారు. నెక్‌టైలపై నిషేధం విధిస్తే, పురుషుల వస్త్రధారణపై ఆంక్షలు విధించడం ఇదే తొలిసారి అవుతుంది. 2021 ఆగస్టులో అఫ్గానిస్థాన్‌ను హస్తగతం చేసుకున్నప్పటి నుంచి తాలిబన్లు మహిళలపై అనేక ఆంక్షలు విధిస్తున్న విషయం తెలిసిందే. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు హిజాబ్ ధరించడాన్ని తప్పనిసరి చేశారు. మహిళలు యూనివర్సిటీ విద్యను అభ్యసించడాన్ని నిషేధించడంతోపాటు పాఠశాల విద్యపైనా అనేక ఆంక్షలు విధించారు. బ్యూటీ పార్లర్లను నిషేధించారు. తాజాగా పురుషుల వస్త్రధారణపై దృష్టి పెట్టారు.

'ఇండియా'ను చీల్చడానికే...

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. ఈ విషయం తమకు తెలుసునని, ప్రభుత్వానికి తాము అదేస్థాయిలో గుణపాఠం చెబుతామని మనోజ్ ఝా చెప్పారు. ఎస్‌పీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ఈడీ అధిపతిగా మిశ్రా తప్ప ఇంకెవరూ సమర్థులు లేరా అని సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించిందని, దీనికి ప్రభుత్వం నుంచి సమాధానం లేదని చెప్పారు. తప్పుడు కేసులతో విపక్ష నేతలను వలలో వేసుకోవడం కోసమే మిశ్రాను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఉపనాయకుడు ప్రమోద్ తివారీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నెలన్నర కాలం మాత్రమే మిశ్రా పదవీకాలం ఎందుకు పొడిగించారని, ఈ కొద్ది సమయంలో ఏమి చేద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు. బీహార్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు బీజేపీ ఏమైనా చేస్తుందని, అయితే, రాజకీయంగా విఫలం కావడం తప్పదని స్పష్టంచేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకొని ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు బనాయించడానికి బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఇండియా ఆవిర్భావంతో బీజేపీకి భయం పట్టుకుందని తివారీ వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుస్మితా దేవ్ మాట్లాడుతూ బీజేపీకి ఆయుధంగా ఈడీ పనిచేస్తోందని విమర్శించారు. దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకొని బీహార్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ ప్రభుత్వాలను బీజేపీ లక్ష్యంగా చేసుకుందన్నారు. ఈ ప్రభుత్వాలను అస్థిరపరచడం ద్వారా ఇండియా కూటమిని బలహీనపర్చడానికి కుట్ర చేస్తోందని ఆరోపించారు.

శాంతి పునరుద్ధరణే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చూపుతూ కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు సిఫార్సులు చేస్తుంది. 'ఇండియా' ఎంపీల మణిపూర్ పర్యటన వివరాలను విపక్ష నేతలు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. తమ పర్యటనకు ముందు...మణపూర్ హింసపై రిటైర్డు సుప్రీంకోర్టు జడ్జితో విచారణకు ఆదేశించాలని లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'ఇండియా' ఎంపీల బృందంలో కాంగ్రెస్ నుంచి అధిర్ రంజన్ చౌదరి, గౌరవ్ గొగోయ్, సుస్మితా దేవ్ (టీఎంసీ), మహువా మజీ (జేఎంఎం), కనిమొళి (డీఎంకే), వందనా చవాన్ (ఎన్‌సీపీ), జయంత్ చౌదరి (ఆర్‌ఎల్‌డీ), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జేడీ), ఎన్‌కే ప్రేమచంద్రన్ (ఆర్‌ఎస్‌పీ), టి.తిరుమవలవన్(వీసీకే)తో పాటు కొంతమంది సభ్యులుగా ఉండవచ్చని తెలుస్తోంది. గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ మణిపూర్‌లో అంతా సవ్యంగానే ఉందని చెప్పడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, అలాంటిప్పుడు హింస కొనసాగకూడదు గదా అని ప్రశ్నించారు. అందుకే సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి నాయకత్వంలో విచారణ చేయించాలని తాము కోరుతున్నామని చెప్పారు. మణిపూర్ హింసకు కారణాలేమిటి? హింసను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం ఎంత ఉంది? ఇంత పెద్దమొత్తంలో అక్కడి ప్రజలకు ఆయుధాలు ఎలా అందాయి? ప్రభుత్వం ఏమి చేస్తుంది? వంటి అంశాలు బయటికి వస్తాయని ఆయన చెప్పారు. 'ఎఫ్ఐఆర్‌లు వందకు పైగా నమోదయ్యాయని స్వయానా ముఖ్యమంత్రి ఎన్.బీరేన్‌సింగ్ అంగీకరించారు. అలాంటప్పుడు ప్రభుత్వ యంత్రాంగం రెండు నెలలు ఎందుకు నిద్రపోతోంది?. అందుకే రిటైర్డు సుప్రీంకోర్టు జడ్జితో దర్యాప్తు అడుగుతున్నాం.

'ఇండియా' ఎంపీలు మణిపూర్ వెళుతున్నారు. వాస్తవాలను వెలికితీసి పార్లమెంటు ముందు పెడతాం' అని గొగోయ్ పార్లమెంటు వెలుపల పీటీఐకి చెప్పారు. తృణమూల్ ఎంపీ దేవ్ మాట్లాడుతూ మణిపూర్ ప్రజలకు తాము అండగా ఉన్నామన్న సందేశం ఇవ్వాలని ప్రతిపక్షం కోరుకుంటున్నదని తెలిపారు. మణిపూర్ పరిణామాలపై తాము ఆందోళనగా ఉన్నామని, అక్కడ శాంతి పునరుద్ధరణ జరగాలని కోరుకుంటున్నామని, ప్రభుత్వం విఫలమైనందునే తాము అక్కడకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు దేవ్ వివరించారు. డీఎంకే నేత టీఆర్ బాలు మాట్లాడుతూ ప్రతిపక్ష ప్రతినిధి బృందం శనివారం ఉదయం ఇక్కడి నుంచి మణిపూర్ బయలుదేరి వెళుతుందని చెప్పారు. అక్కడ జరిగిన తప్పొప్పులు, ఆస్తి, ప్రాణనష్ట వివరాలు తెలుసుకుంటుందన్నారు. ఆర్‌ఎస్‌పీ నేత ప్రేమచంద్రన్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన పరిణామాలపై ప్రాథమికంగా అంచనా వేయడమే పర్యటన ఉద్దేశమని చెప్పారు. మణిపూర్‌లో ఇంకా హింస కొనసాగుతోందని, అక్కడి పరిణామాలను వాస్తవిక దృష్టితో పరిశీలించి ప్రభుత్వానికి, పార్లమెంటుకు సూచనలు, సిఫార్సులు చేస్తామని తెలిపారు.

కాగా, విపక్ష ఎంపీల బృందం మణిపూర్ పర్యటనకు ఇంకా అనుమతి లభించలేదు. హింసతో అతలాకుతలమైన మణిపూర్‌పై ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంటులో ప్రకటన చేయాలని, దానిపై చర్చకు అంగీకరించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం విదితమే.

గుండ్రేవులపై ఇంత నిర్లక్ష్యమా?

(మొదటిపేజీ తరువాయి)

లేదు. ఎప్పుడు పనులు మొదలు పెడతారో కూడా తెలియని పరిస్థితి కనిపిస్తోంది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిన గుండ్రేవుల ప్రాజెక్టుపై విశాలాంధ్ర ప్రత్యేక కథనం...

కర్నూలు, కడప తీవ్ర వర్షాభావం గల జిల్లాలు. వర్షం వస్తే తప్ప పంటలు పండే పరిస్థితి లేదు. ఈ రెండు జిల్లాల రైతులకు సాగు, తాగునీరు అందించే కేసీ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. ఈ కాలువకు నీరు అందించే సుంకేసుల డ్యామ్ నీటి సామర్థ్యం కేవలం1.2 టీఎంసీలు మాత్రమే. ఈ కాలువ కింద కర్నూలు, కడప జిల్లాల్లో ఉన్న 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించలేని పరిస్థితి ఉంది. కేసీ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీరు అందించాలన్నా, కర్నూలు జిల్లాలో కరువు కాటకాలతో అల్లాడుతున్న పశ్చిమ ప్రాంతానికి తాగు, సాగు నీరు అందించాలన్నా...తుంగభద్ర నదిపై గుండ్రేవుల వద్ద ఆనకట్ట నిర్మించడం ఒక్కటే ఏకైక పరిష్కారమని సాగునీటి నిపుణులు సూచించారు.

డీపీఆర్‌కు 2013లోనే నిధుల కేటాయింపు

సీ.బెళగల్ మండలంలో గుండ్రేవుల దగ్గర 20 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ.54.95 లక్షలకు పరిపాలన ఆమోదం ఇచ్చింది. 2013 నవంబర్ ఒకటిన టెండర్లు ఆహ్వానించి...హైదరాబాద్‌కు చెందిన ఏఆర్వీఈఈ అసోసియేట్స్‌కు కాంట్రాక్టు అప్పగించింది. ఈ సంస్థ సర్వే, విచారణ పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. నివేదిక ప్రకారం ఈ ప్రాజెక్టు నిర్మాణం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో ముడిపడి ఉంది. రెండు రాష్ట్రాల సమన్వయంతోనే ఈ ప్రాజెక్టు నిర్మించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల ఏపీలో కర్నూలు జిల్లాలోని సంగాల, కొత్త సంగాల, తిమ్మన దొడ్డి, పలుకుదొడ్డి చింతమనపల్లి, రాయచోటి, గురుజాల, నాగలదిన్నేలో 10 గ్రామాలు, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెద్ద దన్వాడ, వేణి, సోమాపురం, కేశవరం 5 గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయని నివేదిక తెలిపింది. కర్నూలు జిల్లాలో చెరువుపల్లి, చామల గూడూరు, పెద్ద కొట్టాల, జోహరాపురం, మహబూబ్‌నగర్ జిల్లాలో కటుకునురు, కిసాన్‌నగర్ గ్రామాలు పాక్షికంగా ముంపునకు గురవుతాయని వెల్లడించింది. 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి 2015 అక్టోబర్ 13న డీపీఆర్‌ను సంబంధిత అధికారులకు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి కేఆర్ఎంబీ ద్వారా రూ.2,890 (సవరించిన అంచనాల ప్రకారం రూ.5,400 కోట్లకు చేరింది) కోట్లకు ఈ ప్రాజెక్టు అనుమతి పొందింది. సుంకేసుల బ్యారేజీకి తుంగభద్ర నదిపై అదనపు రిజర్వాయర్ కోసం ప్రభుత్వం సూత్రప్రాయంగా పరిపాలనాపరమైన ఆమోదం తెలుపుతూ 2019 ఫిబ్రవరి 21న జీవో జారీ చేసింది. అంతేకాక అప్పటి సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కోడుమూరు సమీపంలో శిలాఫలకం వేశారు. ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో ఈ ప్రాజెక్టును చేర్చారు. కేంద్రం 2020 అక్టోబర్ 6న నీటి సమస్యలపై అపెక్స్ సమావేశం ఏర్పాటు చేసింది. కానీ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు నిర్మాణంపై చర్చను కూడా తీసుకురాలేదు.

ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

ప్రాజెక్టు డీపీఆర్‌ను 2015లో ఆమోదించినా...2019 ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేర్చినా...ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు మొదలవుతాయో కూడా తెలియని పరిస్థితి. రెండు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ మధ్య సత్సంబంధాలు ఉండటంతో ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, శరవేగంగా పనులు పూర్తి చేస్తారని రైతన్నలు భావించారు. అయినప్పటికీ ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పట్లో పనులు మొదలయ్యేలా కనిపించడం లేదు. దీంతో కర్నూలు, కడప జిల్లాల అన్నదాతల ఆశలు అడియాసలవుతున్నాయి. ముఖ్యంగా కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత రైతులు, కేసీ కెనాల్ కింద ఉన్న ఆయకట్టు రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసి భూములకు నీళ్లు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ సీపీఐ, ఏపీ రైతుసంఘం నాయకులు పదేపదే ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడమే కాకుండా పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పాజెక్టులు సందర్శించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.

మునక!

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి దయనీయంగా ఉంది. తాజాగా శబరి నది వరద పోటెత్తడంతో కూనవరం మండలంలో పదుల సంఖ్యలో గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలైన కొండలు, గుట్టలను వెతుకులాడుకుంటూ వెళుతున్నారు. గత ఏడాది దాదాపు వారం రోజుల పాటు వరద నీటిలోనే మగ్గిన దృశ్యాలను తలచుకుని విలపిస్తున్న ప్రజలకు మళ్లీ ఇప్పుడు గోదావరి వరదలు ఆశనిపాతంలా తగిలాయి. శబరి, గోదావరి సంగమ స్థానమైన కూనవరంలో శుక్రవారం గోదావరి 50 అడుగులకు చేరుకోగానే అనేక కాలనీలు నీట మునిగాయి. ప్రజలు ఎడ్లబండ్లలో తమ సామాన్లు వేసుకుని ఇక్కడ సురక్షిత ప్రాంతంగా చెప్పుకునే కోతులగుట్టకు పయనమయ్యారు. అక్కడ దేరాలను ఏర్పాటు చేసుకుని ప్రాణాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కూనవరం రోడ్లపై పడవలు తిరుగుతున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. పంటలు వరుసగా రెండేళ్లు దెబ్బతిన్నాయి. మరో పక్క విజరురం మండలం పరిస్థితి దయనీయంగా ఉంది. ఎటు చూసినా వరద బీభత్సం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విష పురుగుల మధ్య, వరద ముంపు ఆందోళన నడుమ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గత ఏడాది ముంపునకు గురైన సందర్భంలో ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చు అయ్యాయి. మళ్లీ ఏడాది గడవక ముందే ఈ పరిస్థితి రావడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎటపాక మండలంలోని అనేక గ్రామాలను గోదావరి వరద చుట్టుముట్టింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించుకునేందుకు సర్వం వదిలేసి జనం పరుగులు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కనీసం జాలి చూపించడం లేదు. ప్రభుత్వం బాధ్యతలను మరిచి వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటు పక్క తెలంగాణ ప్రభుత్వం మంత్రులను పంపి వరద బాధితులను పునరావాస కేంద్రాలకు చేరుస్తూ అక్కడ వసతులను కల్పించే పనిలో నిమగ్నమైతే ఆంధ్రా ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదన్న వేదన బాధితుల్లో వ్యక్తమవుతోంది. ఎవరో ఒకరు తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మునేరు మహోగ్రం

(మొదటిపేజీ తరువాయి)

చుట్టుముట్టింది. కీసర వద్ద మునేరుకు కట్టలేరు, వైరా ఏరులు తోడవడంతో వరద ఉధృతి మరింత పెరిగింది. ఇక మునేరుతో పాటు పులిచింతల దిగువున ఉన్న చిన్నపాటి వాగులన్నీ పొంగి ప్రవహిస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్‌కి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టాన్ని నిల్వ చేస్తూ అదనపు నీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టా కాలువలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరాని అధికారులు నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మొత్తం 70 గేట్లు ఉండగా, 40 గేట్లు 6 అడుగులు మేర ఎత్తగా, 30 గేట్లను 7 అడుగుల మేర ఎత్తి 2.70 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువున ఉన్న లంక గ్రామస్తులను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరాలకు తరలిస్తున్నారు. వరద ప్రాంతాన్ని శుక్రవారం విజయవాడ సిటీ పోలీసు కమిషనర్ క్రాంతి రాణా టాటా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై వరద నీరు అతివేగంగా ప్రవహిస్తున్నందున ప్రమాదాన్ని నివారించేందుకు వాహనాలు నిలిపివేశామని తెలిపారు. ఇందుకు వాహనదారులు, ప్రజలు అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఎవరూ ఆ వరదల్లో వెళ్లడానికి సాహసించవద్దన్నారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత వాహనరాకపోకలు సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరిస్తామని చెప్పారు. ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసు వ్యవస్థ గత రాత్రి నుండి రోడ్లపై నిద్రిస్తూ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

పీఎస్ఎల్వీసి-56 రాకెట్ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

కిలోల డీఎస్ఎస్ఏఆర్ ప్రధాన ఉపగ్రహం కాగా 23.58 కిలోల బరువుకలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ సాటిలైట్, ఆర్కేడ్ 23 కేజీల వేలాక్స్-ఏయం,12.8 కిలోల బరువు కలిగిన ఓఆర్బి-12 స్పైడర్, 3.84 కేజీల బరువు ఉన్న గలాసియా-2, 4.1 కేజీల బరువైన స్కూబ్-11, 3.05 కేజీల నులయస్ అనే ఉపగ్రహాలను అంతరిక్షంలోని535 కిలోమీటర్లలో లోయర్ ఎర్త్ ఆర్బిట్లో ప్రవేశపెట్టనున్నారు. ఇది పూర్తి వాణిజ్యపరమైన ప్రయోగమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ రోజు ఉదయం 5 గంటలకు ఈ ప్రయోగానికి సంబంధించి కౌంట్ డౌన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. అనంతరం 25 గంటల 30 నిమిషాలు కౌంట్ డౌన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆదివారం ఉదయం 6 గంటల 30 నిమిషాలకు పిఎస్ఎల్వీసి-56 రాకెట్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు నింగిలోకి పంపనున్నారు. అటు సింగపూర్ శాస్త్రవేత్తలు, ఇటు ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోటలో ఈ ప్రయోగానికి సంబంధించి ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.

ఇద్దరు ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు

విశాలాంధ్ర-విజయవాడ(క్రైం): కోర్టు ధిక్కరణ కేసులో ఇద్దరు ఉన్నతాధికారులకు ఏపీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పాఠశాల విద్యార్థులను రాజకీయ సభలకు తరలించటంపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ఆదివాసి గిరిజన చైతన్య వేదిక అధ్యక్షులు చొక్కారావు హైకోర్టులో దాఖలు చేశారు. విద్యార్థులను రాజకీయ సమావేశాలకు తరలించరాదని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని, కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని పిటిషనర్ తరఫు న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థులను రాజకీయ సభలకు తరలించడం చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఏపీ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, హోంశాఖ కార్యదర్శి హరీశ్ గుప్తాకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఇద్దరు ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు ఇవ్వడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. అమ్మ ఒడి సభకు విద్యార్థులు, తల్లిదండ్రులు రావడం తప్పుకాదన్నారు. లేదంటే ఇలాంటి కార్యక్రమాలకు సినీ నటులు వస్తారా? అని ప్రశ్నించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల రాకపై కోర్టు సూచనలిస్తే పాటిస్తామని తెలిపారు.

దేశంలో 5 కోట్ల కేసులు పెండింగ్

సుప్రీంకోర్టులోనే 69,766 కేసులు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ హైకోర్టుల్లో 71 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం శుక్రశారం లోక్‌సభకు తెలిపింది. ఆశ్చర్యకరమేమంటే ఈ 71 వేల కేసులు 30 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. కింది కోర్టుల్లో 30 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను 1.01 లక్షలుగా ప్రకటించింది. సభ్యులు అడిగిన ప్రశ్నకు న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వకంగా వివరాలు తెలిపారు. ఈ ఏడాది జులై 31 నాటికి హైకోర్టుల్లో 30 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 71,204 అని మంత్రి మేఘ్వాల్ పేర్కొన్నారు. అదే విధంగా కింది కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్యను 1,01,837గా తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో గల కేసులు ఐదు కోట్లకు పైగానే ఉన్నట్లు ఇటీవల రాజ్యసభకు తెలిపానని మంత్రి వివరించారు. సుప్రీంకోర్టు, 25 హైకోర్టులు, సబార్డినేట్ కోర్టుల్లో మొత్తం 5.02 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జులై ఒకటో తేదీ వరకు సుప్రీంకోర్టులోనే 69,766 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి వివరించారు. కోర్టుల్లో పెండింగ్ కేసులు పెరగడానికి న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ చేయకపోవడం ఒక్కటే కారణం కాదని మంత్రి తెలిపారు.

అధికారం కోసం మహిళల గౌరవం తాకట్టు

కేంద్రంపై రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ: బీజేపీకి అధికార దాహం పెరిగిందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. మహిళల గౌరవం, దేశ ఆత్మగౌరవంతో బీజేపీ ఆడుకుంటుందని మండిపడ్డారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ శుక్రవారం ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. దేశంలో లైంగిక దాడుల ఘటనలకు సంబంధించి మీడియా నివేదికలను రాహుల్‌గాంధీ షేర్ చేశారు. మణిపూర్‌లో ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించడానికి సంబంధించిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఉత్తరాఖండ్‌లో బీజేపీ నాయకుడి కుమారుడే మహిళలను హత్య చేశాడని, బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం కేసులో దోషులను విడుదల చేయడం వంటి అంశాలను రాహుల్ ప్రస్తావించారు. మహిళలను గౌరవించని దేశం ప్రగతి సాధించడం అసాధ్యమని వ్యాఖ్యానించారు. అధికారం కోసం మహిళల గౌరవం, దేశ ఆత్మగౌరవంతో బీజేపీ ఆటలాడుకుంటుందని కాంగ్రెస్ నేత విమర్శించారు.

హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు కూడా సీజేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హైటీ కార్యక్రమంలో గవర్నర్ నజీర్, జగన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

జస్టిస్ ధీరజ్ సింగ్ నేపథ్యం

జమ్మూకశ్మీర్‌కు చెందిన జస్టిస్ ధీరజ్‌సింగ్‌ది న్యాయమూర్తుల కుటుంబం. ఆయన తండ్రి, సోదరుడు కూడా న్యాయమూర్తులుగా పనిచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తీర్థసింగ్ ఠాకూర్ సోదరుడే జస్టిస్ ధీరజ్‌సింగ్. న్యాయవర్గాల్లో అత్యంత సౌమ్యుడిగా, వివాదరహితుడిగా, సమర్థుడిగా జస్టిస్ ధీరజ్ సింగ్‌కు పేరుంది. ఇటీవల కాలం వరకు బాంబే హైకోర్టులో నంబర్ టూ స్థానంలో కొనసాగారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన 2026 ఏప్రిల్ 24న పదవీ విరమణ చేస్తారు.

జీ20 పర్యావరణ వర్కింగ్ గ్రూప్ భేటీ



చెన్నై: భారత జీ20 అధ్యక్షతన ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ సస్టైనబిలిటీ వర్కింగ్ గ్రూప్ (ఇసిఎస్‌డబ్ల్యుజి) మంత్రుల సమావేశం శుక్రవారం చెన్నైలో ప్రారంభమైంది. వీడియో సందేశం ద్వారా సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ 'యుఎన్ క్లైమేట్ కన్వెన్షన్', 'పారిస్ ఒప్పందం' ప్రకారం కట్టుబాట్లపై చర్య తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పర్యావరణ, వాతావరణ స్థిరత్వ వర్కింగ్ గ్రూప్ కింద రెండు రోజుల చర్చల తర్వాత ప్రారంభమైన మంత్రివర్గ సమావేశం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రి భూపేంద్ర యాదవ్ అధ్యక్షతన జరిగింది. 4వ ఇసిఎస్‌డబ్ల్యుజి సమావేశంలో పర్యావరణం, వాతావరణంపై రెండు వేర్వేరు ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ ట్రాక్ కింద, నీటి వనరుల నిర్వహణపై చర్చించగా, క్లైమేట్ ట్రాక్ కింద, వాతావరణ మార్పుల అంశంపై ప్రతినిధులు అభిప్రాయాలను పంచుకున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశంలో జీ20 సభ్యులతో పాటు ఆహ్వానిత దేశాలకు చెందిన 300 మంది ప్రతినిధులు తమ ఉనికిని నమోదు చేసుకున్నారు. ఈ కార్యవర్గానికి ఇది నాల్గవ సమావేశం. గత మూడు ఇసిఎస్‌డబ్ల్యుజి సమావేశాల సందర్భంగా జరిగిన వివిధ సెషన్లలో, భారత ప్రెసిడెన్సీ గుర్తించిన మూడు విస్తృత నేపథ్య రంగాలపై సహకార, సమగ్ర చర్చలు జరిగాయి. ఈ అంశాలపై మంత్రివర్గ సమావేశంలో ఏకాభిప్రాయంపై చర్చలు జరిగాయి. భూమి క్షీణతను అరికట్టడం, నీలి ఆర్థిక వ్యవస్థ, వనరుల సామర్థ్యం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడంపై ప్రతినిధులు అభిప్రాయాలను పంచుకున్నారు. దీనితో పాటు, మంత్రివర్గ ప్రకటన ముసాయిదాను ఖరారు చేయడం సమావేశంలో ప్రతినిధులు ప్రధానంగా దృష్టి సారించారు.

వరద బాధితులకు అండగా నిలవాలి

- తక్షణ సాయంగా రూ.2 వేలు, నిత్యావసరాల పంపిణీ
- కచ్చా ఇళ్లకు రూ.10 వేల నష్టపరిహారం
- శిబిరాల్లో విస్తృత సహాయ పునరావాస చర్యలు
- గోదావరి, కృష్ణా వరదలపై సమీక్షలో సీఎం జగన్ ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధితులకు అన్నివిధాలా సహాయక చర్యలు చేపట్టాలని, వారికి అండగా నిలబడాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో వర్షాలు, నదుల్లో వరద ప్రవాహం, సహాయ పునరావాస కార్యక్రమాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్లు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. వరద ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సహాయ పునరావాస కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా సాగాలి. అధికారులు మానవీయ కోణంలో సహాయం అందించాలి. బాధితులకు కలెక్టర్లు మాకు మంచి చేశారు అన్న మాటే వినిపించాలి. అధికారులంతా ఈ విషయాన్ని మనసులో పెట్టుకోవాలని సీఎం వారికి మార్గనిర్దేశనం చేశారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద నీటమట్టం 49.60 అడుగులు ఉందని, రేపు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53.81 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోందని అన్నారు. అందువల్ల ఇప్పటికే తరలించిన లోతట్టు ప్రాంతాల బాధితులకు సహాయ శిబిరాల్లో మంచి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. శిబిరాల్లో అధికారులు ఉంటే... ఎలాంటి సదుపాయాలు కావాలనుకుంటారో అలాంటి సదుపాయాలన్నీ కూడా వారికి అందాలన్నారు. సహాయ శిబిరాల నుంచి బాధితులను తిరిగి ఇళ్లకు పంపించేటప్పుడు ప్రతి కుటుంబానికి రూ.2 వేలు ఇవ్వాలని, వ్యక్తులైతే వారికి రూ.1,000 ఇవ్వాలని సీఎం ఆదేశించారు. అలాగే కచ్చా ఇళ్ల నుంచి సహాయ శిబిరాలకు వచ్చినవారిని వారిని తిరిగి ఇళ్లకు పంపించేటప్పుడు వారికి రూ.10 వేలు ఇవ్వాలని సూచించారు. దానివల్ల వారు ఆ కచ్చా ఇంటిని మరమ్మతు చేసుకోవడానికి, తిరిగి కట్టుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ముంపునకు గురైన ఇళ్లు, అలాగే వరద నీరు ప్రవహించిన ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, కేజీ పామాయిల్, కేజీ కందిపప్పు ఇవ్వాలని, మొత్తంగా బాధితుల పట్ల మరింత ఉదారంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సీఎం చెప్పారు. లంక గ్రామాలలో జనరేటర్లు లాంటివాటిని సిద్ధం చేసుకోవాలని, తాగునీటి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. వరద నీరు తగ్గాక పంట నష్టం వివరాలను నమోదు చేసుకుని రైతులకు బాసటగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి చర్యలోనూ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్న సందేశం అందించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్, ఆర్అండ్‌బీ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ జి.లక్ష్మీషా, ఏపీ విపత్తు నిర్వహణశాఖ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గోదావరి జిల్లాలకు
రూ.12 కోట్ల అత్యవసర సాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలు, వరదలతో ప్రభావితమైన జిల్లాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. గోదావరి జిల్లాలకు రూ.12 కోట్ల అత్యవసర నిధుల్ని మంజూరు చేసింది. శుక్రవారం రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యాజమాన్య ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీజేశారు. ఇందులో పశ్చిమ గోదావరి జిల్లాకు రూ.2కోట్లు, తూర్పుగోదావరికి రూ.కోటి, అల్లూరి, కోనసీమ, ఏలూరు జిల్లాలకు రూ.3కోట్ల చొప్పున నిధులను మంజూరయ్యాయి. అత్యవసర సహాయక కేంద్రాల ఏర్పాటుకు, ముంపు గ్రామాల నుంచి ప్రజలను తరలించేందుకు, వరద బాధితులకు ఆహారం, నీరు, పాలు, వైద్య శిబిరాల నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాలు తదితర అవసరాలకు గాను ఈ నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. భారీ వర్షాలు, వరదలపై సీఎం జగన్ సమీక్షలు నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో వరద ప్రభావానికి గురైన గోదావరి జిల్లాలకు అత్యవసర నిధుల కింద రూ.12కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

ఐఏఎస్‌ల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం ఏడుగురు ఐఏఎస్ లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో ఐఏఎస్‌లతోపాటు జాయింట్ కలెక్టర్లు, ముఖ్య విభాగాల అధికారులు ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయం అదనపు సంచాలకులుగా ధ్యానచంద్ర, ఉద్యానవన సంచాలకులుగా గంధం చంద్రుడు, కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్‌గా శ్రీవాస్ నుపూర్, అజయ్ కుమార్‌ను నియమించారు.

ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ సమస్యపై నిర్లక్ష్యమేమిటి?

సాయి శ్రీనివాస్, తిమ్మన్న ప్రశ్న

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల అనంతరం సవరించిన కేడర్ స్ట్రెంత్ సమస్య రెండు నెలలుగా అమరావతిలోని కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, ఇంకెంత కాలంలో దీనిని పరిష్కరిస్తారో చెప్పాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న విద్యాశాఖ సంయుక్త సంచాలకులు మువ్వ రామలింగంను ప్రశ్నించారు. ఎన్‌టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్టణంలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో రామలింగంను కలిసి బదిలీ అనంతర సమస్యలపై వినతిపత్రం సమర్పించి చర్చించారు. అనంతరం సాయిశ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు పూర్తిచేసి ఇప్పటికి రెండు మాసాలు పూర్తయిందని, అయినా సవరించిన కేడర్ స్ట్రెంత్ వివరాలు ఇప్పటివరకు రాష్ట్ర ఖజానా కార్యాలయానికి పంపకపోవడం అత్యంత శోచనీయమని విమర్శించారు. రెండు మాసాలుగా కేడర్ స్ట్రెంత్ వివరాలు పంపనందున ఖజానా కార్యాలయం డైరెక్టర్ లేఖ రాయడం విద్యాశాఖ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ అభ్యర్ధనకు జేడీ స్పందిస్తూ మూడు రోజులుగా అన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల నుంచి సంబంధిత సిబ్బందిని పిలుచుకున్నామని, రెండు రోజుల్లో పనిపూర్తి చేసి రాష్ట్ర ఖజానా కార్యాలయానికి పంపుతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. బదిలీల అనంతరం సమస్యలపై కర్నూలు, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల విద్యాశాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయాలని, నిర్లక్ష్యం వహించిన శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా అప్‌గ్రేడ్ అయిన హైస్కూల్‌లకు హెడ్‌మాస్టర్ పోస్టులు మంజూరు చేయాలని, ప్రతి మండలానికి ప్లస్ టు పాఠశాలను మంజూరు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 20 వేల ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మువ్వా రామలింగంను కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కాకుమాను జోజప్ప తదితరులు ఉన్నారు.

సినిమా షూటింగ్‌లకు
బుద్ధవనం అనువైనది: గగన్‌మాలిక్

నందికొండ: అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ థీమ్ పార్క్ బుద్ధవనంలోని ప్రత్యేకతలు తనను ఎంతగానో అకట్టుకున్నాయని బుద్ధవనం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటుతానని బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్ తెలిపారు. నాగార్జునసాగర్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనాన్ని ఆయన సందర్శించారు. బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆయనకు స్వాగతం పలికి బుద్ధ వస్త్రాలతో సత్కరించారు. అనంతరం బుద్ధవనం కన్సల్టెంట్ డా.ఈమని శివా నాగిరెడ్డి... ధ్యాన వనం, బుద్ధ విగ్రహం గురించి ఆయనకు వివరించారు. గగన్‌మాలిక్ మాట్లాడుతూ... చలనచిత్రాలు, బుల్లితెర చిత్రాల చిత్రీకరణకు బుద్ధవనం అనువైన ప్రాంతమన్నారు. బాలీవుడ్, టాలీవుడ్ దర్శక, నిర్మాతలకు దీని ప్రాముఖ్యతను వివరిస్తానని తెలిపారు. బుద్ధవనానికి అంతర్జాతీయ గుర్తింపు తేవడానికి తెలంగాణ ప్రభుత్వానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ప్రముఖ్ కే రాజు, శ్యామ్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు జగన్ పెద్దపీట: మోపిదేవి వెంకట రమణ

విశాలాంధ్ర బ్యూరో-ఢిల్లీ/అమరావతి: సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు పెద్దపీట వేశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ స్పష్టం చేశారు. ఢిల్లీలో శుక్రవారం ఆయన వైసీపీ బీసీ ఎంపీలతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లో ఒక విచిత్రమైన పరిస్థితి కన్పిస్తోందని, అబద్ధాలతో ప్రచారం చేయడమనేది టీడీపీకి వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. టీడీపీకి, వారికి మద్దతు తెలిపే ఇతర పార్టీలు తమ ఉనికిని కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నాయని, మరోవైపు చంద్రబాబు పుత్రుడు లోకేశ్ యువగళం పేరుతో కుల సంఘాల్ని కూడగట్టేందుకు డబ్బులు ఖర్చుపెట్టి, సినిమా యాంకర్లను తెచ్చి సమావేశాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాజకీయ కుట్రలను చూసి నేర్చుకున్న లోకేశ్ కూడా గ్లోబెల్స్ ప్రచారంతో రాజకీయ లబ్ధి పొందాలని పాట్లు పడుతున్నారన్నారు. అమర్నాథ్ హత్యపై రాజకీయపరమైన కారణాలేవీ లేవని నొక్కిచెప్పారు. ఆ సంఘటనపై సీఎం జగన్ చలించిపోయి, తక్షణ ప్రభుత్వ సాయంగా రూ.10 లక్షలు ప్రకటించారని గుర్తుచేశారు. నాడు రిషితేశ్వరి తల్లిదండ్రులకు అపాయింట్ మెంటు చంద్రబాబు ఇవ్వలేదన్నారు. 2014-19 మధ్య బీసీలకేం చేశారో చెప్పే దమ్ము టీడీపీకి ఉందా? అని ప్రశ్నించారు. జగన్ హయాంలోనే బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపు లభించిందని వివరించారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

విట్ వర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగం సంపాదించడం కంటే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదిగేలా సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వీఐటీ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి ఉద్భోదించారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, వాద్వాని ఫౌండేషన్ సంయుక్త అధ్వర్యంలో ఈనెల 25 నుంచి ప్రారంభమైన ఇగ్నైట్ ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ శుక్రవారం ముగిసింది. భవిష్యత్ వ్యవస్థాపకులను పెంపొందించడానికి, అధ్యాపకులకు నైపుణ్యాలతో సాధికారత కల్పించే ప్రయత్నంలో భాగంగా వీఐటీ-ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ వాద్వాని ఫౌండేషన్‌తో కలిసి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఇగ్నైట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా వాద్వానీ ఫౌండేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, రీజియనల్ హెడ్ నావేద్ అహ్మద్‌లు స్టార్టప్‌లు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో వారి అనుభవాలను పంచుకున్నారు. వీసీ కోటారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక వృద్ధిని సాధించడంలో, ఉపాధి అవకాశాల కల్పనలో వ్యవస్థాపకత ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమం నూతన ఆవిష్కరణలు, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని పెంపొందించే లక్ష్యాలకు దోహదపడుతుందని చెప్పారు. విట్ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ విద్యాపరంగానే కాకుండా సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరిచి విద్యార్థులను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమ విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. హాజరైన అధ్యాపకులకు వీఐటీ-ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డా.ఎస్ఎస్ శాంతకుమారి స్వాగతం పలికారు.

కర్షక-కార్మిక రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : ప్రధానమంత్రి మోదీ దుష్పరిపాలన నుంచి రైతులను, శ్రామికులను కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ల ఐక్యవేదిక అధ్వర్యంలో విజయవాడ పీబీ సిద్దార్థ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 30న తలపెట్టిన కర్షక-కార్మిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇక్కడి మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే వారిని ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన మోదీ చోద్యం చూస్తున్నారన్నారు. పారిశ్రామికరంగ విధ్వంసానికి కూడా మోదీ ప్రభుత్వం పూనుకుందని, 40 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేస్తున్నదని విమర్శించారు. తన అనునయులైన అంబానీ, అదానీలకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదన్నారు. మరొసారి నరేంద్ర మోదీ ప్రధాని అయితే సామాన్యులకు కూడు, గూడు కరువై బతికే అవకాశాలు కూడా సన్నగిల్లుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ కర్షకులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే ఈ సదస్సులో రైతులు, రైతు కూలీలు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సదస్సుకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, ఇఫ్టా జాతీయ కార్యదర్శి గని, కార్మిక సంఘం నాయకులు పుప్పాల సత్యనారాయణ, కాబోతూ ఈశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుర్రంకొండ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

'శ్రీసత్యసాయి' కార్మికులకు జీతాలు చెల్లించాలి

డేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర- ఏలూరు: శ్రీ సత్యసాయి తాగునీటి ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ 3 నెలల జీతాలు చెల్లించాలని శ్రీసత్య సాయి డ్రింకింగ్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్, వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ ను కలిసి వేతన బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజ్ఞాపన పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏజెన్సీ మెట్ట ప్రాంత ప్రజలకు తాగునీరు అందించేందుకు భగవాన్ సత్యసాయి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 2007వ సంవత్సరంలో నిర్మాణాలు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిందని తెలిపారు. పోలవరం, చింతలపూడి, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాలలో 200 గ్రామాలకు, కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 4 గ్రామాల ప్రజలకు గోదావరి జలాలను సరఫరా చేస్తున్నారు. ఈ పథకంలో 165 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 115 మంది మాత్రమే ఉన్నారని, ఎల్అండ్ టీ వారు రెండు నెలల 15 రోజుల జీతాలు కార్మికులకు చెల్లించాల్సి వుందన్నారు. ప్రభుత్వం సరిగా నిధులు కేటాయించని కారణంగా ఈ పథకం నుంచి ఎల్ అండ్ టి కంపెనీ వారు తప్పుకున్నారని చెప్పారు. ప్రస్తుతం తూర్పుగోదావరి ఏజెన్సీ ప్రాంతంలో, అనంతపురం జిల్లాలో కార్మికుల కంటే ఏలూరు జిల్లా స్కీం లో పనిచేస్తున్న కార్మికుల జీతాలు తక్కువగా ఉన్నాయన్నారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చిన తర్వాత ఏప్రిల్, మే, జూన్ నెల జీతాల బకాయిలు ఉన్నాయని, పాతవాటితో కలుపుకొని 7నెలల జీతాల బకాయిలు ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని జీతాలు చెల్లించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దేగా ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మత్స్యకారుల సంక్షేమం కోసం స్థానిక మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడం, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాల కల్పనే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ముందడుగులు వేస్తోందని రాష్ట్ర మత్స్య, పశు సంవర్థక, డెయిరీ శాఖామాత్యులు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్స్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులపాటు నిర్వహించే రెండో సీ ఫుడ్ ఫెస్టివల్ ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఏటా 50 లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తితో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రధానంగా చేపలు, రొయ్యల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న మనం వినియోగంలో మాత్రం వెనుకబడి ఉన్నామన్న ఉద్దేశంతో డొమెస్టిక్ మార్కెటింగ్ అనే అంశాన్ని ప్రభుత్వం చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని భూమి ఆర్గానిక్స్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా సీ ఫుడ్ ఫెస్టివల్స్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. జూలై 28, 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న సీ ఫుడ్ ఫెస్టివల్‌లో రూ.699 కే అన్ లిమిటెడ్ సీ ఫుడ్ బఫెట్ లభిస్తుందన్నారు. త్వరలో విశాఖపట్నం, కర్నూలు, నెల్లూరు వంటి నగరాల్లోనూ సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫిష్ ఆంధ్రా.. ఫిట్ ఆంధ్రా అనే నినాదాన్ని ప్రతి గడపకు తీసుకెళ్లేలా మత్స్యశాఖ లక్ష్యంగా పెట్టుకుని ముందడుగులు వేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రం తీసుకున్న ఆర్కిటెక్చర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ నమూనాను కేంద్ర ప్రభుత్వం కూడా ప్రస్తుతం అనుసరిస్తోందన్నారు. రాష్ట్రంలో సీ ఫుడ్ వినియోగదారులు పెద్ద ఎత్తున ఉన్నారని, ఈ 'మేరకు ' ఫిష్ ఆంధ్రా' బ్రాండ్ తో స్థానిక వినియోగం పెంచేలా ఆక్వా హబ్స్ అండ్ స్పోక్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఒక ఆక్వా హబ్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఆక్వా హబ్ కు అన్ని విధాలుగా మద్దతిచ్చి..దీని ద్వారా జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ రకాల అవుట్ లెట్స్‌కు సరఫరా చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 1,400 అవుట్ ను ఏర్పాటు చేయగా.. త్వరలో మరో 2,000 అవుట్ లెట్స్ ను అందుబాటులోకి తీసుకు రానున్నామన్నారు. అందులో భాగంగా మరిన్ని హబ్స్, అవుట్ లెట్స్ ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించడం, వినియోగదారుల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా సీ ఫుడ్ ఫెస్టివల్స్ ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కరోనా మరియు ఆక్వా రంగంలో ఎగుమతులకు సంబంధించిన రెండు విపత్తులను జగనన్న ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషక విలువలు ఉన్న ఈ మత్స్య సంపదను రాష్ట్రంలో ఒక వ్యక్తి ఏడాదికి కేవలం 8 కేజీలకు మించి వినియోగించుకోవడం లేదన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఫెస్టివల్ కు 20 వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచేందుకు డొమెస్టిక్ మార్కెట్ ను విస్తృత పర్చాల్సిన అవసరం గుర్తించి ఆ దిశగా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలోని మత్స్యకారులకు, మత్స్య సంపదను వృద్ధి చేసే రైతులకు మరింత మేలు చేసే విధంగా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయడం జరుగుతోందన్నారు. ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెంచేలా.. ఫిష్ ఆంధ్రా అనే బ్రాండ్ ను మరింతగా ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం ఫిష్ ఆంధ్రా డొమెస్టిక్ మార్కెటింగ్ ప్రజా పోర్టల్ వెబ్ సైట్ ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎఫ్ సీఓఎఫ్ ఛైర్మన్ శ్రీ.కె. అనిల్ బాబు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ. తోలేటి శ్రీకాంత్, రాష్ట్ర మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్లు వి.వి.రావు, శ్రీ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు ఆపండి

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్

విశాలాంధ్ర - తిరుపతి: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి మాట్లాడుతూ మానవత్వం లేని మణిపూర్ ఘటనలపై మన ప్రధాని నోరు మెదపకపోవడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. జయలక్ష్మి అన్నారు. మహిళలపై వేధింపులను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాఖ్య తిరుపతి నగర 7వ మహాసభ శుక్రవారం గంధమనేని శివయ్య భవన్‌లో చిన్న రత్నం అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన జయలక్ష్మి మాట్లాడుతూ, మహిళలపై వేధింపులు, దాడులు హత్యలు, అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలకు భారంగా మారిన ధరలను అదుపు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి మురళి, నగర కార్యదర్శి జె. విశ్వనాధ్ మాట్లాడుతూ, మహిళా సాధికారిత సాధనకు మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళా సీనియర్ నాయకులు ఖమర్ బేగం మాట్లాడుతూ మతం ముసుగులో మహిళలపై దాడులు చేయడం హేయమైన చర్యనీ, వీటిపై ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నదియా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి మహిళా సమాఖ్య పోరాడాలన్నారు.

సీపీఎస్ రద్దుపై పోరాటం ఆగదు

ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘం 21వ రాష్ట్ర మహాసభలను ఆగస్టు 21,22 తేదీలలో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోం రాష్ట్ర కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను గౌరవ అతిథి, ప్రభుత్వ సలహాదారు ఎస్.చంద్రశేఖరరెడ్డితో కలిసి బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రధానంగా ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ మహాసభ ఉంటుందన్నారు. ఉద్యోగుల సమస్యలపై మహాసభలో చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ప్రధానంగా పెండింగులో ఉన్న రెండు డీఏలలో ఒక డీఏను చెల్లించేలా ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ఉద్యోగుల మహాసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనడం సంప్రదాయమని, ఇదే ప్రాతిపదికగా ఈ మహాసభలో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొం టారని తెలిపారు. ఈ మహాసభ ద్వారా ఉద్యోగుల వాణి ప్రతిధ్వనించేలా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగులకు సంబంధించి ఆర్థిక, ఆర్థికయేతర సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించేందుకు ఇటువంటి మహాసభల ద్వారా సాధ్యమవుతుందన్నారు. జిల్లాల వారీగా ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యల పరిష్కారంపై తీర్మానాలు చేస్తామన్నారు. ఓపీఎస్ విధానంలో కొన్ని మార్పులు చేసేందుకు ప్రభుత్వం కొన్ని సూచనలు చేసినప్పటికీ సీపీఎస్ పూర్తిస్థాయిలో రద్దు చేసేదాకా ఉద్యోగ సంఘాల పోరాటం ఆగదన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ఉద్యోగుల మనోభావాలకు అనుగుణంగా రాష్ట్ర నాయకత్వం అడుగులు వేస్తుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే విషయంలో కొంతమందికి జరిగిన నష్టాన్ని గుర్తించా మన్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఏ ఒక్క కాంట్రాక్టు ఉద్యోగికి అన్యాయం జరగకుండా రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకుం టుందని చెప్పారు. ఈ మహాసభలకు రాష్ట్ర ముఖ్య మంత్రితోపాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే యంత్రాం గంలోని ముఖ్యులు కూడా హాజరవుతారని వెల్లడించారు. ఇప్పటివరకు అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలకు ఉద్యోగులకు ఆమోదయోగ్య పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతినెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించే అంశంలో ఉన్న ఇబ్బందులు తొలగిపోయాయని, తమతోపాటు పెన్షనర్లకు కూడా ఒకే సమయంలో జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని పేర్కొన్నారు.ఆర్టీసీ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ మహాసభ వేదిక కానుందని వివరించారు. ఉద్యోగుల సంక్షేమ విభాగం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నలమారు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్ర మాలు ఉద్యోగుల కృషి వల్లనే విజయవంతంగా కొనసాగు తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులు నాగూర్ షరీఫ్, పశ్చిమ కృష్ణ అధ్యక్షులు ఏ విద్యాసాగర్, కార్యదర్శి ఎండీ ఇక్బాల్, మహిళా విభాగం చైర్ పర్సన్ నిర్మల, కె.శివలీల, విజయశ్రీ, కమర్షియల్ టాక్సెస్ విభాగం అధ్యక్షులు వెంకటేశ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జానీ పాషా తదితరుల పాల్గొన్నారు.

సంపాదకీయం

మారుతున్న రాజకీయ చిత్రం

ఈ ఏడాది చివరలోగా మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తిస్ గఢ్ శాసన సభలకు, 2024 ఆరంభంలో లోకసభ ఎన్నికలు జరగనున్నందువల్ల రాజకీయ సమీకరణలు వేగవంతంగా మారి పోతున్నాయి. బీజేపీని గద్దె దించే వ్యూహంలో భాగంగా కొన్ని రాజకీయ పార్టీలు తమ శత్రు పక్షాలను కూడా చేర దీస్తున్నాయి. ఈ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఈ రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ సకల ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్‌ను గద్దె దించి అధికారం సంపాదించడానికి బీజేపీ కూడా అనేక మార్గాలు అన్వేషిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి, బీజేపీకి ప్రధాన వ్యూహకర్త అమిత్ షా అప్పుడే ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో ప్రచారంలో మునిగి పోయి ఉన్నారు. తెలంగాణా శాసనసభ ఎన్నికలు కూడా ఈ ఏడాది ఆఖరులోగా జరగాలి. కె.చంద్రశేఖరరావు నాయకత్వంలోని భారతీయ రాష్ట్ర సమితి (ఇంతకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి) కూడా మళ్లీ అధికారం నిలబెట్టుకోవడానికి ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. కె.సి.ఆర్. పార్టీ ప్రతిపక్ష కూటమి "ఇండియా" లో చేరలేదు. తమది ప్రతిపక్షమే అన్నట్టుగా వ్యవహరిస్తుంది. మోదీని విమర్శించడానికి సకల అవకాశాలను వినియోగించుకుంటుంది. అన్ని ప్రాంతీయ పార్టీలలాగే బి.ఆర్.ఎస్.కూడా ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నట్టు కనిపిస్తూనే బీజేపీని గట్టిగా వ్యతిరేకించదు. ఈ వ్యతిరేకత మాటలకే పరిమితం. ప్రస్తుత లోకసభలో ప్రాంతీయ పార్టీల నడవడికను చూస్తే ఈ పార్టీలన్నీ కీలక దశలో ప్రతిపక్షాలతో నిలబడకుండా మోదీ సర్కారును సమర్థించిన సందర్భాలే ఎక్కువ. అనేక బిల్లులు ప్రస్తావనకు వచ్చినప్పుడు ఈ పార్టీలన్నీ బీజేపీతోనే చేయి కలిపాయి. బి.ఆర్.ఎస్. తెలంగాణలో అజేయంగా ఉన్నట్టు కనిపిస్తున్నా ఈ మధ్య కాలంలో కాంగ్రెస్ పుంజుకుంటున్నందువల్ల కంగారు పడుతోంది. అంతకు ముందు బీజేపీనే తమకు ప్రధాన ప్రత్యర్థి అవుతుందని భావించిన కె.సి.ఆర్. పరిస్థితి మారడంతో కాంగ్రెస్‌ను ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో కె.సి.ఆర్. పార్టీ ప్రతిపక్షాలకే అండగా ఉంది. మణిపూర్ విషయం లోనూ ఇదే పరిస్థితి. శాసనసభ ఎన్నికల్లో అధికారం నిలబెట్టుకోవడం కోసం కె.సి.ఆర్. భీంఆర్మీ పార్టీతో చేయి కలపడానికి కూడా సిద్ధంగా ఉన్నారు.. బి.ఆర్.ఎస్. నాయకుడు నామా నాగేశ్వర్ రావు కూడా అవిశ్వాస తీర్మానం ప్రేశ పెట్టడానికి నోటీసు ఇచ్చిన వారిలో ఉన్నారు. బి.ఆర్.ఎస్.కు లోకసభలో తొమ్మిది మంది సభ్యులున్నారు. అయితే బి.ఆర్.ఎస్. "ఇండియా" ఫ్రంట్ లో భాగస్వామి కాదు. మోదీని బలంగా సవాలు చేస్తున్నది ఈ ప్రతిపక్ష ఫ్రంటే. తెలంగాణ శాసనసభ ఎన్నికలు ముగిస్తేతప్ప బి.ఆర్.ఎస్. వైఖరి జాతీయ రాజకీయాలలో ఎలాఉంటుందో తెలియదు. 80 లోకసభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్ లో ప్రధాన ప్రతిపక్షమైన అఖిలేశ్ నాయకత్వంలోని సమాజ్ వాదీ పార్టీ ప్రతిపక్షాలతో బాహాటంగా చేయి కలిపే విషయంలో ఇప్పటికీ సందిగ్ధత వీడలేదు. ఉత్తర ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీకి బీజేపీని ఒంటరిగా ఎదుర్కోగలనన్న ధీమా కనిపిస్తోంది. అయితే ఆ రాష్ట్రంలో ప్రతిపక్షాల మహా కూటమికి అఖిలేశే నాయకత్వం వహించవచ్చు. దళితుల సంక్షేమ కోసం పాటుపడ్తున్న భీం ఆర్మీ నాయకుడు చంద్ర శేఖర్ ఆజాద్ తో పొత్తు కోసం అఖిలేశ్ ప్రయత్నిస్తూనే ఉన్నారు. షహరాన్ పూర్, ముజఫ్ఫర్ నగర్, బిజ్నోర్ ప్రాంతాలలో భీం ఆర్మీకి పట్టు ఉంది. బెంగళూర్‌లో ఇటీవల జరిగిన ప్రతిపక్షాల సమావేశాలలో సమాజ్‌వాదీ పార్టీ, దానికి అనుబంధంగా ఉన్న రాష్ట్రీయ లోక్‌దళ్, అప్నాదళ్ (కె) కాంగ్రెస్‌తో చేయి కలిపే అవకాశాలను పరిశీలిస్తున్నాయి. ఇందులో అఖిలేశ్ కన్నా మిగతా రెండు పార్టీలే ఎక్కువ ఉత్సాహం చూపుతున్నాయి. కాంగ్రెస్ ను బలహీన పరచి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్న ఆం ఆద్మీ పార్టీ కూడా కాంగ్రెస్ తో స్నేహం చేయక తప్పని స్థితి ఉంది. అందుకే ఆం ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్‌గాంధీతో సోనియా గాంధీ సమావేశం కావడానికి ప్రాధాన్యత ఏర్పడింది. రాజ్యసభలో సంజయ్ సింగ్ ను సస్పెండ్ చేసిన తరవాత ఆయన పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం దగ్గర నిరసన దీక్ష పూనారు. సోనియా గాంధీ ఆయనను కలుసుకుని కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ అధికారంలోకి రావడం కాంగ్రెస్‌కు అనివార్యం. కాంగ్రెస్‌గెలిస్తే ప్రతిపక్షకూటమిలో నూతనోత్సాహం నింపుతుంది. అందుకే మధ్యప్రదేశ్‌లో గిరిజనులు, దళితులు, మహిళల మీద కాంగ్రెస్ దృష్టి కేంద్రీకరిస్తోంది. సామాజిక న్యాయం అన్నభావన మళ్లీ రంగంమీదికివస్తోంది. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే కులాల ప్రాతిపదికన జనగణన ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు కమల్‌నాథ్ హామీ ఇస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని మాల్వా, బుందేల్‌ఖండ్, వింధ్య ప్రాంతాల మీద కాంగ్రెస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఏటా రూ.18,000 ఆర్థికసహాయం అందజేస్తామని కమల్‌నాథ్ అంటున్నారు. మధ్య ప్రదేశ్ శాసనసభలో 47 స్థానాలు గిరిజనులకు, 35 సీట్లు షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేకించారు. ఆ రాష్ట్ర జనాభాలో 37 శాతం గిరిజనులు, షెడ్యూల్డ్‌కులాల వారే. రాజస్థాన్ లో అధికారం నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ మానవాభివృద్ధి మీద ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. బీజేపీ విద్వేష రాజకీయాలను ఎదుర్కోవడానికి ఇదే మెరుగైన వ్యూహం అనుకుంటున్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ప్రజానుకూల విధానాలు ముఖ్యంగా ప్రజారోగ్య పరిరక్షణ, కనీస ఆదాయం అన్న ప్రతిపాదనలకు ఆదరణ పెరుగుతోంది. రాజస్థాన్ ప్రభుత్వ ఆరోగ్యపథకం రాష్ట్రంలోని ఏ ఆసుపత్రిలోనైనా డబ్బు చెల్లించకుండా చికిత్స చేయించుకునే సదుపాయం కల్పిస్తుంది. కనీస ఆదాయ పథకం కింద నెలకు వెయ్యి రూపాయలు అందిస్తారు లేదా ఏడాదిలో 125 రోజులు ఉపాధి కల్పిస్తారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏడాదిలో వంద రోజులకే ఉపాధి హామీ ఉంది. ఈ పథకానికి మోదీ ప్రభుత్వం నిధులకేటాయింపులో కోతపెడ్తోంది. అందువల్ల కాంగ్రెస్ ప్రతిపాదన జనాకర్షణకు తోడ్పడవచ్చు. ఈ పథకాన్ని పట్టణ ప్రాంతాలలోనూ అమలు చేయాలనుకుంటోంది. మరో వైపు ఇలాంటి పథకాలను మోదీ రేవడీలు(తాయిలు) అని విమర్శిస్తున్నారు. ఆయన చేస్తున్న పనీ అదేనన్నది వేరే విషయం. గెహ్లాత్ ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది. శిక్షణావకాశాలు పెంచుతోంది. పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది. నూతన పథకాల రూపకల్పనకు ఎంత ప్రాధాన్యంఉందో కొత్త రాజకీయ సమీకరణలకు అంతకన్నా ఎక్కువ ప్రాముఖ్యతే ఉంటుంది.

సహకారానికి ఆర్బీఐ సంకెళ్లు

డాక్టర్ సీ.ఎన్. క్షేత్రపాల్‌రెడ్డి

సహకార వ్యవస్థ (కోపరేటివ్ మూమెంట్) ఆదర్శాలతో బ్యాంకింగ్ రంగంలో కృషిచేస్తున్న సంస్థలే సహకార బ్యాంకులు. బ్రిటీష్ కాలంలో కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీస్ చట్టం-1904, 1912 నాటి సహకార సంఘాల చట్టాల ద్వారా సహకార బ్యాంకుల ఏర్పాటు జరిగింది. సెంట్రల్ కమిటీ ఫర్ కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటై శిక్షణ ఇవ్వడంతో 1950ల నాటికి దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తమ సేవలను ప్రారంభించాయి. సభ్యులే ఈ బ్యాంకులకు యజమానులు. డైరెక్టర్ల (బ్యాంకు పాలకవర్గం) ఎంపిక చాలా ప్రజాస్వామ్యయుతంగా జరుగుతుంది. స్టేట్ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్, సెంట్రల్ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్‌ల ఆధ్వర్యంలో ఆయా చట్టాల పరిధిలో ఈ ప్రక్రియ సాగుతుంది. బ్యాంకు సభ్యుల నుంచే డైరెక్టర్లు, బోర్డు సభ్యులు ఎన్నికల ద్వారా పాలకవర్గంగా ఏర్పడి కార్యకాలాపాలను నిర్వహిస్తారు.

బ్యాంకింగ్ రెగ్యులేషన్స్ యాక్ట్-1949 కి 1965లో చేసిన సవరణల ప్రకారం ద్వంద్వ నియంత్రణ అమలులోకివచ్చి బ్యాంకింగ్ కార్యకలాపాలు మాత్రమే ఆర్బీఐ నియంత్రణలో జరుగుతున్నాయి. 'నష్టం-లాభం' లేని పద్ధతిలో పరస్పర సహకారమే ఈ బ్యాంకుల ప్రధాన లక్ష్యం. తమ కార్యకలాపాల ద్వారా సాధిస్తున్న మిగులులో నుండి 25 శాతం నిధులను రిజర్వుడ్ ఫండ్‌గా, 10 శాతం నిధులను విపత్కర పరిస్థితుల కోసం, 1 శాతం సహకార విద్యానిధికి కేటాయించి తక్కిన నిధులను సభ్యులకు డివిడెండ్ల రూపంలో, ఉద్యోగులకు బోనస్, సభ్యుల సంక్షేమ నిధికి కేటాయింపులు చేసి ఆర్బీఐ నుంచి ఆర్థిక ప్రయోజనాలను, ప్రభుత్వ సహకారాన్ని ఆశించకుండా పనిచేస్తున్నాయి. పేద, మధ్యతరగతి సహా వివిధ రంగాలకు చేయూతనిస్తూ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో, ప్రజల్లో పొదుపు అలవాటును ప్రోత్సహించడంలో ముందున్నాయి.

అయితే ఇటీవల ఆర్బీఐ తీసుకుంటున్న నిర్ణయాలు, మితిమీరిన అనవసర జోక్యం, సహకార బ్యాంకుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. బ్యాంకింగ్ కార్యకలాపాల విషయంలోనే కాకుండా తమకు ఏ మాత్రం సంబంధంలేని పాలకవర్గాల విషయంలోనూ అనవరంగా జోక్యంతో ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ఉవ్విళ్లూరుతోంది. పాలకవర్గం విషయంలో ఆర్బీఐకి ఎటువంటి హక్కులు లేవు. బ్యాంకింగు కార్యకలాపాలవరకే నియంత్రణ ఉన్నా పాలకవర్గాలపైనా తీవ్రమైన నిర్బంధాలకు దిగుతోంది. బహుళ రాష్ట్రాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోన్నది విశాఖపట్నం కోపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గం విషయంలో చూపిన అత్యుత్సాహమే ఇందుకు తాజా ఉదాహరణ. అయితే 2022, ఏప్రిల్ 21న దేశంలోని కొన్ని అర్బన్ బ్యాంకులు తమ పాలకవర్గంలో డైరెక్టర్లుగా ఎన్నికకాని వ్యక్తులను ఎమిరిటస్ చైర్మన్, గ్రూప్ చైర్మన్ పేర్లతో ప్రత్యేక

హోదాలిస్తున్నారని, తక్షణమే ఆ పదవులను తొలగించాలని ఆదేశిస్తూ సర్క్యులర్‌ను జారీ చేసింది.

విశాఖ కోపరేటివ్ బ్యాంకు సర్వసభ్య సమావేశంలో బ్యాంకు సభ్యులు ఎన్నుకున్న డైరెక్టర్, మాజీ చైర్మన్‌గానూ పనిచేసిన వ్యక్తి ఎమిరటస్ చైర్మన్‌గా ఉన్నారు. ఈ ఎన్నికకోసం బ్యాంకు బైలాను కఠినమైన నిబంధనలతో సవరణలుచేసి 2014లోనే కేంద్ర సహకార సంఘాల కమిషనర్ వద్ద సమోదు చేయించారు. ఈ నేపథ్యంలో ఆర్బీఐ జారీచేసిన సర్క్యులర్ ప్రకారం, తమ పాలకవర్గంలో సభ్యులచేత ఎన్నికకాని డైరెక్టర్ ఎమిరటస్ చైర్మన్‌గా వ్యవహరించడంలేదని, ఈ సర్క్యులర్ తమకు వర్తిస్తుందా లేదా వివరణ ఇవ్వాలని కోరుతూ ఆర్బీఐకి ఆ బ్యాంకు లేఖ రాసింది. ఈ లేఖపై స్పందించిన ఆర్బీఐ చాలా కటువుగా ఎమిరటస్ చైర్మన్ అనేది ఉండడానికి వీల్లేదంటూ ఆ బాధ్యతల్లో పనిచేస్తున్న వ్యక్తి పేరును ప్రస్తావిస్తూ హుకుం జారీ చేసింది. ఇది ఆర్బీఐ ఏకపక్ష ధోరణికి పరాకాష్ట. తమ పరిధిలోకి రాని పాలకవర్గం విషయంలో సర్క్యులర్ ఇవ్వడమే అన్యాయం. చట్ట ప్రకారం రూపొందిన సంస్థ బైలాకు విరుద్ధంగా బ్యాంకు నడవాలని ఆర్బీఐ ఆదేశించడం బాధ్యతా రాహిత్యమే. ఇది ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంటు ద్వారా ఏర్పాటైన సంస్థ చేయాల్సిన పనికాదు. రాజ్యాంగ నియమాలు, 97 వ రాజ్యాంగ సవరణ అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించినా ఈ అంశం రుజువవుతుంది.

ఆర్బీఐ ప్రకారం దేశంలో 1,514 అర్బన్ కోపరేటివ్ బ్యాంకులు పనిచేస్తున్నాయి. వీటిలో 52 బ్యాంకులకే షెడ్యూల్డ్ హోదా ఉంది. గత 18 ఏళ్లుగా అర్బన్ బ్యాంకులకు షెడ్యూల్డ్ హోదా ఇవ్వకుండా ఆర్బీఐ నియంత్రణ పెట్టింది. చిన్న చిన్న ప్రైవేటు బ్యాంకులకు మాత్రం షెడ్యూల్డ్ హోదా కట్టబెట్టడం సహకార రంగంపై ఆర్బీఐకి ఉన్న వివక్షకు తార్కాణం. ప్రైవేటు బ్యాంకులు కోరడమే తడవుగా కొత్త బ్రాంచీల ఏర్పాటుకు అనుమతులు మంజూరుచేస్తూ సహకారరంగంలో పనిచేస్తున్న బ్యాంకుల విషయంలో ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. మోదీ ప్రభుత్వం కరోనా లాక్‌డౌన్ కాలంలో ఎటువంటి చర్చలకు అవకాశం లేకుండా బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949కి అనేక సవరణలు చేసింది. ఈ సవరణలన్నీ సహకార అర్బన్ బ్యాంకులే లక్ష్యంగా వాటి ఉనికిని ప్రశ్నార్థకం చేయడానికేననే ఆరోపణలొచ్చాయి. సహకార సూత్రాలకు విరుద్ధంగాచేసిన ఈ సవరణలపై కోర్టుల్లో కేసులు విచారణలో ఉన్నాయి. బ్యాంకు సీఈవో, ఎండీల నియామకాల విషయంలో ఆర్బీఐ జారీచేసిన ఉత్తర్వులపై వివిధ హైకోర్టులు స్టే విధించాయి. అయినా పాలకవర్గంలోని వ్యక్తుల అర్హతలు, పదవీ కాలం, సంస్థ నుంచి సభ్యులు వైదొలగడం, ఎన్నికలు, షేరు ధనం వాపసు తదితర అంశాల్లో దుందుడుకు చర్యలకు దిగుతోంది.

మోదీ ప్రభుత్వహయాంలో ఆర్బీఐ తన స్వతంత్రతను కోల్పోయిందనే విమర్శలున్నాయి. గత ఏడాది జరిగిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు తరుణంలో ఆర్బీఐకి చెప్పకుండా ప్రభుత్వమే ఎన్నికల బాండ్ల గడువు పెంచడం వివాదాస్పదమైంది. ఇందుకు ఆర్బీఐ ఆమోదం లేదనే విషయం సామాజిక కార్యకర్త లోకేశ్ కె.బాత్రా దాఖలుచేసిన సమాచార దరఖాస్తు వెల్లడించింది. తాజాగా రెండు వేలనోటును వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించిన ఆర్బీఐ గతంలో వెయ్యి, రూ.500 నోట్లను రద్దు చేస్తున్నట్టు తామే ప్రకటించలేని నిస్సహాయతకు కారణం మిలియన్ డాలర్ల ప్రశ్న. ఆర్బీఐలో ఉండే ఆర్థిక నిల్వలపైనా అనేక వివాదాలు నెలకొన్నాయి. మోదీ హయాంలో లక్షల కోట్ల రిజర్వు నిధులను ఆర్బీఐ కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయడం ఇందులో ప్రధానం.

దేశ బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం అమలవుతున్న లైసెన్స్, నియంత్రణ విధానాలను పరిశీలించిన ఆర్బీఐ అంతర్గత కార్యనిర్వహణ గ్రూప్ నవంబరు 20, 2020 న సమర్పించిన నివేదికలో కార్పొరేట్లకు బ్యాంకులను ఏర్పాటుచేసుకునే అవకాశమివ్వాలని ప్రతిపాదించింది. 1949 బ్యాంకింగ్ నియంత్రణ చట్టానికి సవరణలుచేసి బడా కార్పొరేట్, పారిశ్రామిక సంస్థలను బ్యాంకింగ్‌లోకి అనుమతించాలని సూచించడం వివాదాస్పదం. రూ.50వేల కోట్ల ఆస్తులుండి, బ్యాంకింగేతర ఆర్థిక కార్య కలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలకు పూర్తిస్థాయి బ్యాంకింగ్ కార్య కలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వాలనేది మరో సిఫారసు. ప్రసన్నకుమార్ మహంతి నాయకత్వంలో చేసిన సిఫారసుల వెనుక కార్పోరేట్ల ఒత్తిడి ఉందనే చర్చ నడుస్తోంది. కార్పొరేట్‌ల ఒత్తిడికి లొంగిపోతే ఇప్పటికే పెరిగిపోయిన మొండిబాకీల భారంసుండి బ్యాంకింగ్ రంగం బయటపడే అవకాశాలు సన్నగిల్లి పోతాయి. ఆ బ్యాంకులేవీ సామాజిక బాధ్యతను నిర్వర్తించవు కాబట్టే ఆర్బీఐ ఇప్పటి వరకూ ఏ కార్పొరేట్ సంస్థకూ బ్యాంకుల ఏర్పాటుకు ఆర్బీఐ అనుమతివ్వలేదు. కార్పొరేట్ల ఒత్తిడికి తలొగ్గకుండా ఇకపైనా పని చేస్తుందా అనేది ప్రశ్నార్థకమే.

సెల్: 9059837847

రైతులు శపిస్తారు... జాగ్రత్త...

శుభ్రంగా కడిగేసిన ఆకుపచ్చటి అరటి ఆకు. ఆ ఆకులో కుడివైపు చివర పసుపు రంగు చీరకు ఎర్రటి జరీ అంచున్న కంచి పట్టు చీరలా ఉంది టమాటా పప్పు. అరటి ఆకు కుడివైపునే పైభాగంలో టమాటా పచ్చడి. ఇది ఆ పట్టు చీరకు అతికినట్టుగా కుట్టిన మ్యాచింగ్ జాకెట్‌లా ఉంది. అరటి ఆకుకు ఎడమ వైపు చిక్కుడుకాయ, టమాటా కూర. వీటికి మధ్యలో పిండి ఆరబోసిన వెన్నెల తునకల్లా తెల్లటి నెల్లూరు మొలకల బియ్యంతో వండిన అన్నం. అరటి ఆకుకి కాస్త దూరంగా స్టీలు గిన్నెలో ఉన్న టమాటా చారులో ఓ పది వరకూ నెలవంకలా తరిగిన టమాటా ముక్కలు తేలుతున్నాయి. వాటితో పాటు నాలుగైదు కరివేపాకు రెబ్బలు. కమ్మటి వాసన వస్తున్న నెయ్యి, దాని పక్కనే నువ్వులనూనె. ఆ విస్తరి ముందు కూర్చున్న టమాట్రావ్ అన్నం కలుపుకుంటూండగా పాత సినిమాల్లో హఠాత్తుగా ప్రవేశించిన పోలీసుల్లా 'యు ఆర్ అండర్ అరెస్ట్' అన్న డైలాగ్ వినిపించింది. అన్నం తింటూంటే అరెస్టేంటి... ఈ సమయంలో అన్నం తినకూడదా. ఇది ఏలికల విధించిన శిక్షా....విధి ఆడిన వింతపరీక్షా... అని అనుకుంటూ "వద్దు ఈ టమాటా పప్పు తినే వరకూ నన్ను అరెస్టు చేయకండి... ఆ టమాటా పచ్చడి నాలికమీద రాసుకునే వరకైనా ఆగండి....ఆ టమాటా

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

చిక్కుడుకాయ కూడా రుచి చూసే భాగ్యాన్ని కలగనీయండి.... బేలగా నా వైపే చూస్తున్న టమాటా చారుని రెండు చెంచాలైనా తాగనివ్వండి" అంటూ అరుస్తున్నాడు టమాట్రావ్ మంచం పై నుంచి. ఆ అరుపులకు, ఈ టమాటా గోలేంట్రా అని చిర్రెత్తుకొచ్చిన భార్య పంట ఎత్తుకు పోయిన టమాటా రైతులా ఆగ్రహించి ఓ తన్ను తన్నింది. అంతే మంచం మీంచి కింద పడ్డాడు టమాట్రావ్. "ఏది నా టమాటా పప్పు... పచ్చడి, కూర..."అంటూ చిన్నపిల్లాడిలా నేలమీద దొర్లుతున్నాడు. ఇలా జరిగిన కొంతసేపటికి తెలిసొచ్చింది తాను ఇంత వరకూ కల కన్నానని, టమాటాతో ఏ వంటకం తినడానికైనా అదేదో సినిమాలో కమల్ హాసన్ అన్నట్లు నుదిటి మీద రాసి ఉండాలని జ్ఞానోదయమైంది.

అంటే అన్నానంటారు గానీ పోతులూరి వీరబ్రహ్మం గారు చెప్పారు తన కాల జ్ఞానంలో. వచ్చేవన్నీ గడ్డు రోజులర్రా అని. విన్నామా.... ఆయన చెప్పినవి ఎన్ని జరగలేదు. మనలో కొంతమంది వినలేదేమోనని పెద్ద ఎన్టీఆర్‌గారు ఏకంగా వీరబ్రహ్మంగారి సినిమాయే తీసారు. అయితే, ఈ టమాటాల గురించి వీరబ్రహ్మం గారు చెప్పారో లేదో కాని... ఇన్ని హితబోధలు చేసినాయన ఈ మాట కూడా చెప్పకుండా ఉంటారా అని సమాధాన పడాలంతే.

కలికాలం కాకపోతే.... టమాటా దొంగతనాలేమిటి. అది కూడా దొంగిలించిన వారు ఎవరో తెలియకుండా హెల్మెట్ పెట్టుకుని మరీనూ. విడ్డూరంగా లేదు. ఇంతేనా...టమాటా పండించిన ఓ రైతును దారి కాచి చంపేసి టమాటా మూటలు ఎత్తుపోయారు దుర్మార్గులు. అర్ధరాత్రి కాబట్టి, అక్కడ సీసీ కెమెరాలు లేవు కాబట్టి ఆ హంతకదొంగల్ని ఇంకా పట్టుకోలేకపోయారు మన పోలీసులు. అసలు టమాటాలకి ఇంత గిరాకీ ఎందుకొచ్చింది. ఇంతకుముందు ఇదే టమాటాకి ధర రాలేదంటూ రైతులు కిలోలకు కిలోలు రోడ్డు మీద పారపోయడం ఏమిటీ...? అప్పుడు అలా జరగడమేమిటీ.... ఇప్పుడు ఇలా జరుగుతున్నదేమిటీ... ? ఈ రెంటికి మధ్య ఉన్న జరుగుతున్న బ్రహ్మ రహస్యం ఏమిటీ. చాలాసేపు ఆలోచిస్తే బుర్ర పగలి టమాటా పిండితే వచ్చే రసంలాంటి రక్తం కారుతోంది కాని సమాధానం దొరకడం లేదు.

అప్పుడెప్పుడో తెలంగాణాలో పత్తి రైతు ఆత్మహత్యకి కారణం కూడా ఇంకా తెలియరాలేదు. దిల్లీ వరకూ పాదయాత్ర చేసిన పంజాబ్ రైతులపై పడిన లాఠీ దెబ్బలకు, వారు చేసిన ఆర్తనాదాలకు కూడా కారణాలు కనుక్కోవాల్సి ఉంది. అంతకు ఇంకా ముందే సుష్మా స్వరాజ్ ఏలికలో ఉన్న కమలనాథుల దిల్లీ ప్రభుత్వం కూడా కేవలం ఉల్లిపాయల వల్లే కూలిందనడానికి కారణాలూ తెలియాల్సి ఉంది. ఉల్లి చేసిన మేలు తల్లి చేయదనే సామెత ఎంతవరకూ నిజమో నాకు తెలియలేదు కాని, దిల్లీ ప్రజలకు మాత్రం ఆ రోజుల్లో తల్లి కంటే ఎక్కువే మేలు చేసిందని ఆనాటి బ్యాలెట్ బాక్సులు చెప్పాయి.

నేను ఓ పత్రికలో రాజకీయ విలేకరిగా ఉన్న సమయంలో ఆనాటి సమైక్య రాష్ట్రంలో చింతపండు ధర కూడా ఇలాగే ఆకాశాన్నంటింది. ఆ రోజుల్లో చింతపండు కోసం దొంగతనాలు, హత్యలు జరగలేదు కాని, తెలుగువారి ఇళ్లలో చాలాకాలంపాటు చింతపండుతో చేసిన వంటకాలు కానరాలేదు. ఆనాటి సమైక్య రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి మీట్ ద ప్రెస్‌లో చింతపండు ధరలు పెరగడం, ఈ ధర స్థిరీకరణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని నేను ఆయన్ని అడిగాను. దానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు "మా చర్యలు మేం తీసుకుంటున్నాం. అయినా.. చింతపండు దొరకక పోతే టమాటాతో చారు చేసుకుంటారు" అన్నారు. ఆ సమాధానానికి నేను "మీరు ముఖ్యమంత్రి. సమస్యపరిష్కరించాలి తప్ప ప్రత్యామ్నాయం... అదే ఆల్టర్‌నేటివ్ చూపకూడదు కదా" అన్నాను. దానికి చంద్రబాబు నాయుడికి చాలా కోపం వచ్చి "తర్వాత ప్రశ్న" అంటూ ఆ విధంగా ముందుకు పోయారు. ఆ సమాధానానికి నాకు ఒకింత అసహనం వచ్చింది కాని... తెలుగు ప్రజలు మాత్రం చంద్రబాబు నాయుడికి ఆ నాటి నుంచి నేటి వరకూ ఆయన అన్నట్లుగానే ప్రత్యామ్నాయం అదేనండి ఆల్టర్‌నేటివ్ చూపిస్తునే ఉన్నారు. టమాటా మొక్కే కదాని పీకి పారేస్తేనూ.... ఉల్లిగడ్డే కదా అని పెరికి విసిరేస్తేనూ... పత్తే కదా అని పకపకా నవ్వుకుంటేనూ... రైతులు ఈ భూమి మీద నడయాడుతున్న అన్నపూర్ణలు. వారి కష్టంతో అన్నమూ పెడతారు...ఉరిమే కళ్లతో శాపమూ ఇస్తారు.

సీనియర్ జర్నలిస్టు, 9912019929

గణపతి పునరాగమనము

ఈ దినము ఉపన్యాసకర్త రాలేదు. వివరము తెలియదు. కాలక్షేపమునకు ముచ్చటించుకొనుచుండగా ఒకరు చేతనున్న దినపత్రిక తెరిచి 'తుపాకీ పేలి ఒకరు మృతి' యను శీర్షికతో యున్న వార్త ఇట్లు జదివెను. సర్వవరమునకు చెందిన సుగుణమ్మకు, గణపయ్యయను యువకునికి గడిచిన యేడాది చిత్రనామ సంవత్సర వైశాఖమున వివాహము జరిగెను. సుగుణమ్మ ఒక్కగానొక్క కూతురగుటచే ఆమె తండ్రి వైభవముగా పెండ్లిజేసెను. వివాహమయిన పిదప గణపయ్య దేశరక్షణకు ఉద్యోగార్థమై బోయెను. గణపయ్యకు తండ్రి లేడు. కోడలు పంచదార బదులు తెచ్చెదనని యొకసారి, కందిపప్పు బదులు తెచ్చెదనని యొకసారి, తెచ్చినవి బదులు తీర్చెదనని మరియొకసారి పలుమార్లు పొరుగింటికి పోవుచుండెను. కిటికీ రెక్కలు మూయకుండెను. అనుమానితురాలైన అత్త కోడలికి తెలియకుండా కుమారునికి ఉత్తరము వ్రాసెను. సరిహద్దున పహారా కాయుచున్న గణపయ్య హుటాహుటిన వచ్చి శత్రు సైనికునిపై యున్న ఆవేశమును పొరుగింటివానిపై జూపి బుర్రవంచి దభీదభీ మని గ్రుద్దుచుండ ధాంమని తుపాకీ శబ్దము వినిపించెను. చూడగా గణపయ్య శవమై క్రింద పడియుండెను. సమాచారము తెలుసుకొని పోలీసులు వచ్చిరి. గోడవారనున్న తుపాకీ ఎటుల పేలెనో తెలియక మల్లగుల్లాలు పడుచుండిరి. ఇరుగు పొరుగు వారిని ఈ విలేకరి విచారించగా తన వ్యవహారమునకు అడ్డు తొలగించుకొనుటకు భార్యయే అటుల జేసినదని కొందరు, ఒకరికి తగులవలసిన గుండు మరి యొకరికి తగిలినదని మరికొందరు చెప్పిరి.

ఆ వార్త విన్న దాసు దీర్ఘాలోచనలో యుండగా తుపాకీ గుండు విషయమనుకొంటిని. అతడొక్కసారి లేచి అయ్యో! గణపతికి మృత్యువు ఇటుల రాసిపెట్టినదా. చిలకమర్తి వారి గణపతియును, ఈ గణపయ్య యును ఒక్కరేయని నా అనుమానము. గణపతికి తండ్రి లేడు. గణపయ్యకునూ తండ్రి లేడు. పోలీసుల నుండి తప్పించుకొని పోయిన గణపతి జాడ తెలియకుండుటచే చిలకమర్తివారు కథ అర్ధాంతరముగా ముగించిరి. జాడ తెలియలేదని తప్పించుకొనిరి. జుట్టుపట్టుకొని ఈడ్చుకొనివచ్చి రెండు దవడలు వాయించి విద్యాబుద్ధులు నేర్పిన ఈ స్థితి దాపురించెడిదా! వాని అల్లరి పడలేక పీడ విరగడైనదని విసిగి ఊరకుండుట తగునా! లేనిచో వీని చావు అర్ధాంతరమని ఊహించి ముగింపు కష్టాంతముగా నుండుట అసమంజసమని అటుల జేసెనా?

ఆచారి: నీవు జెప్పిన ప్రయత్నములన్ని విఫలమైనవి. గణపతి తుంటరివాడు. కొంటెవాడు. చుట్టకాల్చువాడు. చీట్లపేకాడువాడు. శరీరమంతయు జీర్ణకోశముగలవాడు. తెలిసి యొకటి తెలియక నొకటి రెండు అపరాధములు జేసెను. లక్కబొమ్మలు, లక్క పిడత లాడుచున్న మేనమామ కూతురినపహరించి వేరే ఊరికి గొనిపోయి దొంగపెళ్లి చేసుకొనెను. ఆ విషయం తల్లికి కూడా తెలియదు. మేనమామ ఉగ్రుడై గణపతిని చంపివైతునని, పేగులు జంధ్యము వేసుకుందునని ప్రతిజ్ఞపూనెను. తన వరహాల మూటకు, వజ్రపు తునకకు ఎంత ఆపద వచ్చినదోయని రోదించి, మొరటి వాడైన అన్న అన్నంత పని జేయునని భావించి గణపతిని అతని తల్లి వేరే యూరికి గొనిపోయెను. ఇది తెలిసి చేసిన అపరాధము. ఇక రెండవది: ఒక బ్రాహ్మణుడు ఒక బాలికను వెంట బెట్టుకొని వచ్చి ఆమె తన కూతురని, కట్న కానుక లక్కర్లేదని కాశీకి పోవుటకు దారి ఖర్చులిచ్చిన చాలునని జెప్పుటచే ఉబలాటముతో ముందు వెనుక లాలోచించక పెళ్లి చేసుకొనెను. చూడగా ఆ బాలిక వాని కూతురు కాదు. డబ్బు ఆశించి ఇదివరకే ఒకనికిచ్చి పెళ్ళి జేయుటచే మొదటివాడు పోలీసులకు ఫిర్యాదు చేసెను. రక్షక భటులను జూచి గణపతి దొడ్డిదారిన పరుగుదీసి జాడలేకుండా పోయెను. జూచితివా! తెలిసి జేసిన అపరాధమునకు శిక్ష లేదు. తెలియక జేసిన అపరాధమునకు శిక్షపడెను.

శెట్టి : నాకు ఒక్క అనుమానము. గణపతి పొట్టివాడు. సైన్యమునకు ప్రవేశ అర్హత కష్టము.

దాసు : సంధి కాలమున, శాంతియుత వాతావరణమున నీవు జెప్పునది వర్తించును. యుద్ధకాలమున ఒడ్డు పొడుగులు చూడరు. ఆ వార్తలో నేమున్నది సరిగా చదువుము. బుర్ర వంచి వీపుపై దభీదభీమని గుద్దుచుండెనని లేదా? పొడుగు వాడైన ముష్టి యుద్ధము జేయునుగదా.

శెట్టి : వీరమరణము పొందవలసిన గణపతి ఊరకుక్క చావు జచ్చుట దుఃఖ:దాయకము.

దాసు : తుపాకీ గుండునకు చచ్చుటచే వీరమరణమని భావించుట తప్పులేదు.

అంతట శాస్త్రి లేచి ఈ గణపయ్య, చిలకమర్తి లక్ష్మీనరసింహము వారి గణపతి యొక్కరు కాదు. మీరు అటులనుకొనుట ఆయన రచనా వైశిష్ట్యమునకు, చమత్కారమునకు, సహజ నటనాభ్యాస కౌశలమునకు నిదర్శనము. నాటకమున గుడ్డివాడుగా నటించవలెనన్న గుడ్డివానిని జూచి యనుకరింతురు. కుంటివానిగా జేయవలెనన్న కుంటివానిని జూచి రక్తి కట్టింతురు. సభ్యసమాజమున తమ అనుభవములు, అనుభూతులనే రచయితలు కథలుగా మలుతురు. కొసమెరుపు జూచిముగింతురు. కష్టాంతము, సుఖాంతము జూడరు. చిలకమర్తి వారు స్వాతంత్ర్య దీక్షా కంకణ బద్ధుడు "భరత ఖండంబు యొక్క బందిఖాన' యను గీతముతో కష్టములను కడగండ్లను కళ్లకు కట్టినట్లుగా జూపి జనులను కార్యోన్ముఖులను చేసిన మహానుభావుడు. ఆయనను స్మరించుకొని పోవుదమ" ని జెప్పెను. గుండె బరువుతో నేను ఇంటికి బోతిని.

పానుగంటి వారికి కృతజ్ఞతలతో

ఎస్.జి.కె.

అదే అలజడి

- పార్లమెంటులో మణిపూర్ హింసాకాండపై గందరగోళం
- ఉభయ సభలూ సోమవారానికి వాయిదా
- అదే రోజు అవిశ్వాస తీర్మానంపై చర్చ తేదీ ఖరారు

న్యూఢిల్లీ : మణిపూర్ పరిస్థితిపై చర్చ జరగాలన్న డిమాండ్‌పై ప్రతిపక్షాల సభ్యుల నుంచి నినాదాలు కొనసాగుతుండడంతో లోక్‌సభ, రాజ్యసభ శుక్రవారం రోజంతా వాయిదా పడ్డాయి. మణిపూర్‌పై నిరంతర గందరగోళం, కేంద్రంపై అవిశ్వాస తీర్మానం నడుమ ఉభయ సభలు సోమవారం ఉదయం 11 గంటలకు వాయిదా పడ్డాయి. టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్‌తో వాగ్వాదం జరగడంతో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ శుక్రవారం సభను ఆకస్మికంగా సోమవారానికి వాయిదా వేశారు. మణిపూర్ పరిస్థితిపై చర్చ కోసం ఉభయ సభలలోని జాబితాలోని అన్ని అంశాలను పక్కన పెట్టాలనే డిమాండ్‌పై ఇండియా కూటమి సభ్యులు పట్టుబట్టారు. ఈశాన్య రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు, లోక్‌సభ ఉదయం 11 గంటలకు సమావేశమైన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన తర్వాత, సభలో ప్రతిపక్ష సభ్యులు అవిశ్వాస తీర్మానంపై తక్షణమే చర్చకు డిమాండ్ చేశారు. దీనిని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ దాఖలు చేయగా, స్పీకర్ ఓం బిర్లా ఆమోదించారు. దిగువ సభ తిరిగి సమావేశమైనందున స్పీకర్ ప్రశ్నోత్తరాల సమయాన్ని పిలిచారు. అయితే ప్రతిపక్ష సభ్యులు మణిపూర్‌పై చర్చ, అవిశ్వాస తీర్మానాన్ని డిమాండ్ చేస్తూ కార్యక్రమాలను అడ్డుకున్నారు. కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, జేడీ(యూ) తదితర విపక్ష సభ్యులు మణిపూర్ అంశంపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 1978 నాటి ఒక ఉదాహరణను ఉటంకిస్తూ, కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన రోజునే దిగువ సభ దానిపై చర్చకు అనుమతించిందని, అంగీకరించిందని అన్నారు. ఇదే విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి పునరుద్ఘాటిస్తూ, ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే స్పీకర్ నిర్ణయించిన తేదీ, సమయంలో, నిబంధనల ప్రకారం 10 రోజుల గడువును ఉంటుందని తెలిపారు. గందరగోళం మధ్య సభ మూడు చట్టాలను ఆమోదించింది. అవి గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు 2023, నేషనల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ కమిషన్ బిల్లు 2023, నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు 2023, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2023ని సభలో ప్రవేశపెట్టారు. కాగా, మణిపూర్ పరిస్థితిపై రూల్ 267 కింద తనకు 47 నోటీసులు అందాయని రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తెలిపారు. ఈ విషయంపై స్వల్పకాలిక చర్చకు తాను ఇప్పటికే అంగీకరించానని, ప్రభుత్వం ఇప్పటికే దీనికి సుముఖత వ్యక్తం చేసిందని అన్నారు. టీఎంసీ, కాంగ్రెస్, ఇతర సభ్యులు సభ మొత్తం కార్యకలాపాలను నిలిపివేసి 267 నిబంధన ప్రకారం మణిపూర్‌పై తక్షణమే చర్చ జరపాలని తమ డిమాండ్‌ను లేవనెత్తారు. టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ వ్యవహారశైలిపై చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత సభను సోమవారానికి వాయిదా వేశారు. అంతకుముందు, ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న గోవా రాజ్యసభ ఎంపీ వినయ్ దిను టెండూల్కర్‌కు సభ వీడ్కోలు పలికింది.

మణిపూర్ హింసలో ఎవరినీ అరెస్టు చేయలేదు: సీబీఐ

న్యూఢిల్లీ: మణిపూర్ హింసకు సంబంధించి ఆరు కేసులు దర్యాప్తు చేస్తున్న సీబీఐ ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని అధికారులు శుక్రవారం తెలిపారు. నిబంధనల ప్రకారం గతనెలలో రాష్ట్ర పోలీసుల నుంచి ఎఫ్ఐఆర్‌లను సీబీఐ తీసుకుందని, దర్యాప్తు కొనసాగిస్తోందని చెప్పారు. అత్యంత సున్నితమైన ఆరు కేసులను దర్యాప్తు చేస్తున్న సీబీఐ...కేసులు నమోదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్‌లను బహిరంగ పర్చలేదు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ తనకు అప్పగించిన ఆరు కేసుల దర్యాప్తునకు డీఐజీ హోదా అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను సీబీఐ ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. ఈ కేసులను సీబీఐ బృందాలు కఠినపరిస్థితుల్లో విచారణ చేస్తున్నాయని, నిర్బంధాలు, నిరసనలు వంటి అనేక ఇబ్బందికర పరిస్థితులను సీబీఐ బృందాలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. హింసాత్మక ఘటనలు జరుగుతున్న ఈ సమయంలో సాక్ష్యాలు సేకరించడం కష్టసాధ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఆరు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి ఇప్పటి వరకు ఒక్క నిందితుడిని కూడా సీబీఐ అరెస్టు చేయలేదని ఓ అధికారి వెల్లడించారు.

నర్సింగ్, దంత వైద్య విద్య బిల్లులకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: నర్సింగ్, దంతవైద్య విద్యను మరింత నాణ్యతగా అందించే లక్ష్యంతో తీసుకొచ్చిన నేషనల్ నర్సింగ్, మిడ్ వైఫరీ కమిషన్ బిల్లు-23, నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు-23లను లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. 1948 నాటి డెంటిస్ట్స్ యాక్ట్‌ను రద్దు చేసి...దానిస్థానంలో మోదీ సర్కారు నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లును తీసుకొచ్చింది. దంత వైద్యానికి సంబంధించి విద్య అందరికీ అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో బిల్లు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. నేషనల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ కమిషన్(ఎన్ఎన్ఎంసీ) ఏర్పాటు కోసం నేషనల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చింది. అందుకోసం 1947 నాటి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ చట్టాన్ని రద్దు చేసింది. రెండు బిల్లులను లోక్‌సభ ఆమోదించినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పారు. దేశంలో నర్సింగ్, దంతవైద్య విద్య నాణ్యతను మెరుగుపరిచేందుకు, నియంత్రణా వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు బిల్లు దోహదపడుతుందని ఆయన తెలిపారు. భారతదేశంలోనూ, విదేశాల్లోనూ ప్రజలకు ఉత్తమ సేవలందించడానికి డెంటిస్టులు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి నాణ్యమైన విద్యను అందించాలని తమ ప్రభుత్వం కోరుకుంటున్నదని మాండవీయ తెలిపారు.

దర్భంగా జిల్లాలో భద్రత కట్టుదిట్టం

పాట్నా : మతపరమైన జెండాను ప్రతిష్టించడంపై చెలరేగిన ఘర్షణ అనంతరం బీహార్‌లోని దర్భంగా జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్భంగా జిల్లాలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించినట్లు జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆదివారం దర్భంగా పట్టణంలోని బజార్ సమితి చౌక్ సమీపంలో మొహరం పండుగ సందర్భంగా మరో వర్గానికి చెందిన ప్రార్థనా స్థలంలో మతపరమైన జెండాను ఎగురవేయడాన్ని కొందరు వ్యతిరేకించడంతో ఘర్షణ చెలరేగిందని పోలీసులు తెలిపారు. ఉద్రిక్తత పెరిగి ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకోవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనకు సంబంధించి పలువురిని అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. ఉద్రిక్తతలు, పుకార్లు పెరగకకుండా జులై మాసాంతం వరకు సోషల్ మీడియా వెబ్‌సైట్లను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. శనివారం మొహరం సందర్భంగా అల్లర్లు, ఉద్రిక్తతలు ఇతర ప్రాంతాలకు పాకకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు 24 కంపెనీల బిహార్ స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీసులు, 4,500 మంది హోంగార్డులు, 7,790 మంది ట్రైనీ కానిస్టేబుళ్లు, ఆరు కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు.

డెంగీ పరీక్షలలో తీవ్రమైన స్ట్రెయిన్ టైప్-2

ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్



న్యూఢిల్లీ : ఢిల్లీలో 20 డెంగీ పాజిటివ్ నమూనాలన జీనోమ్ సీక్వెన్సింగ్ చేసినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తెలిపారు. వీరిలో 19 మందికి తీవ్రమైన స్ట్రెయిన్ టైప్-2 ఉన్నట్లు తేలిందని ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పర్యావరణంపై నిర్లక్ష్యంతో దోమలు ఉధృతికి కారణమయ్యే వారిపై విధిస్తున్న జరిమానాలను పెంచినట్టు మంత్రి తెలిపారు. గృహాలకు వెయ్యి రూపాయలు, వాణిజ్య సంస్థలకు రూ.5,000కు పెంచినట్టు ఆయన పేర్కొన్నారు. దేశ రాజధానిలో డెంగీ, ఇతర వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు గల మార్గాలను చర్చించడానికి శుక్రవారం జరిగిన సమావేశానికి ముఖ్యమంత్రి అరివింద్ కేజ్రీవాల్ అధ్యక్షత వహించారు. డెంగీ రోగులకు పడకలు రిజర్వ్ చేయాలని, ఆస్పత్రులు, మొహల్లా క్లినిక్‌లలో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఢిల్లీ ఆరోగ్యశాఖను ఆదేశించమని ఆరోగ్య మంత్రి తెలిపారు. పౌర సంఘం నివేదిక ప్రకారం ఈ ఏడాది జులై 22 వరకు దేశ రాజధానిలో మొత్తం 187 డెంగీ కేసులు నమోదైయాయి. 2018 నంచి ఈ కాలంలో ఇదే అత్యధికం.

పర్యావరణ చట్టాలకు మార్పులు అసంబద్ధం: జైరాం రమేశ్



న్యూఢిల్లీ : అటవీ సంరక్షణ చట్టం 1080, జాతీయ జీవవైవిధ్య చట్టం 2002కు ప్రభుత్వం ప్రతిపాదించిన సవవరణలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మాజీ పర్యావరణ శాఖ మంత్రి జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా జీ20 పర్యావరణ, వాతావరణ సుస్థిరతపై మంత్రివర్గ సమావేశంలో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. జీవవైవిధ్య పరిరక్షణ. పునరుద్ధరణ, సుసంపన్నతపై చర్యలు తీసుకోవడంలో భారతదేశం నిలకడగా ముందంజలో ఉందని, ఆధునీకరించబడిన లక్ష్యాల ద్వారా మరింత ఉన్నత స్థాయిని నిర్దేశించిందని మోదీ వ్యాఖ్యానించారు. మనదేశం తన ప్రతిష్టాత్మకమైన జాతీయంగా నిర్ణయించిన భాగస్వామ్యానికి తెరతీసిందని చెప్పడానికి గర్వపడుతున్నానని ప్రధాని అన్నారు. మోదీ వ్యాఖ్యలపై మీడియా కథనాన్ని ట్యాగ్ చేస్తూ రమేశ్ ట్వీట్ చేస్తూ, ఎంత క్రూరమైన జోక్ ఇది..అటవీ సంరక్షణ చట్టం 1980, జాతీయ జీవవైవిధ్య చట్టం 2002లను విస్తృతంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, ఆసాంతం సవరణ చేయడం.. దాన్ని ప్రధాని సమర్థిస్తూ వ్యాఖ్యానించడం దారుణమన్నారు.

చట్టాలలో చేసిన ఈ మార్పులు జీవవైవిధ్యాన్ని రక్షించవు లేదా పరిరక్షణను ప్రోత్సహించవు. సహజంగానే కేంద్ర వైఖరి సత్యంగా చూడబడుతుందనే ఆశతో అబద్ధాన్ని పునరావృతం చేయడమేనని జైరాం రమేశ్ తన ట్వీట్‌లో విమర్శించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అసంబద్ధంగా ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు.

లింగ నిర్ధారణ పరీక్షల అడ్డుకట్టకు ఆంధ్రా-ఒడిశా టాస్క్‌ఫోర్స్

బెర్హంపూర్ : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే అక్రమ అల్ట్రాసౌండ్ క్లినిక్‌లపై ఉమ్మడి దాడులు చేసేందుకు ఒడిశాకు చెందిన గంజాం జిల్లాలోని బెర్హంపూర్, ఆంధ్ర ప్రదేశ్‌లో పొరుగున ఉన్న శ్రీకాకుళం జిల్లాతో కలిసి ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. రెండు జిల్లాలకు చెందిన ఆరోగ్య శాఖ అధికారులు హాజరయిన ఒక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వివరించారు. 'అల్ట్రాసౌండ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీలు, పిండం లింగ నిర్ధారణలో మునిగి ఉన్న మధ్యవర్తుల గుర్తింపు, చట్టపరమైన చర్యల ప్రారంభానికి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది' అని గంజాం ప్రధాన జిల్లా వైద్యాధికారి ఉమా శంకర్ మిశ్రా తెలిపారు. రెండు జిల్లాల్లో అక్రమ లింగనిర్ధారణ పరీక్షలను అరికట్టడం, లింగనిర్ధారణను మెరుగుపర్చడంపై ఇలాంటి సమావేశం జరగడం ఇదే తొలిసారి అని అన్నారు. రెండు జిల్లాల్లో లింగనిర్ధారణ పరీక్షలకు సంబంధించిన విధివిధానాలను రూపొందించేందుకు త్వరలో కలెక్టర్ స్థాయిలో మరో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అల్ట్రాసౌండ్ మిషన్ల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు రెండు జిల్లాల్లో లింగ నిష్పత్తిని మెరుగుపరచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మిశ్రా వివరించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం గంజాం జిల్లాలో జననాల లింగ నిష్పత్తి 855గా ఉంది. శ్రీకాకుళం జిల్లాలోనూ జననానికి లింగ నిష్పత్తి 900 లోపే ఉన్నట్లు అధికారులు తెలిపారు. గర్భిణులను ముందస్తుగా నమోదు చేయడం, ఇప్పటికే ఆడపిల్ల ఉన్న మహిళల రెండవ గర్భాన్ని ట్రాక్ చేయడంతో పాటు ఆడపిల్ల ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు వారు చెప్పారు.

బస్సులో మొదటి ప్రయాణికురాలిగా మహిళలనే ఎక్కనివ్వండి

అపశకునమంటే కుదరదు

ఒడిశా రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశం

భువనేశ్వర్ : వివక్షాపూరిత మూఢనమ్మకాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నంలో భాగంగా, మహిళలు మొదటి ప్రయాణీకులుగా ఉన్నప్పుడు కూడా బస్సులను ఎక్కేందుకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేయాలని ఒడిశా రాష్ట్ర మహిళా కమిషన్ (ఓఎస్‌సీడబ్ల్యూ) రవాణా శాఖను కోరింది. ఒడిశాలోని బస్సు సిబ్బంది మహిళా ప్రయాణికులను ముందుగా వాహనం ఎక్కకుండా అడ్డుకున్నారని, ఇది చెడ్డ శకునంగా భావించి ఓఎస్‌సీడబ్ల్యూ పిటిషన్‌ను పరిష్కరించిన తర్వాత ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఒక మహిళ మొదటి ప్రయాణీకురాలిగా మారితే, బస్సు ప్రమాదానికి గురవుతుంది లేదా రోజు చెడ్డ వ్యాపారం చేస్తుందనే మూఢనమ్మకం నుంచి అహేతుకమైన, వివక్షత లేని ఆచారం ఉద్భవించిందని కమిషన్ గమనించింది.

భువనేశ్వర్‌లోని బారాముండా బస్టాండ్‌లో మొదటి ప్రయాణీకురాలిగా ఒక మహిళా ప్రయాణికురాలిని బస్సు ఎక్కకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ సోనేపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఘసిరామ్ పాండా మహిళా కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. కమిషన్ జులై 26న రవాణా కమిషనర్, చైర్మన్ అమితాబ్ ఠాకూర్‌కు రాసిన లేఖలో 'ఇలాంటి సంఘటనలు గతంలో కూడా మాకు తెలిశాయి. అందువల్ల, భవిష్యత్తులో మహిళా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా వారి భద్రత, గౌరవాన్ని కాపాడటానికి బస్సులు (ప్రభుత్వం, ప్రైవేట్ రెండూ) మొదటి ప్రయాణీకురాలిగా మహిళలను అనుమతించేలా చూడాలని నేను మిమ్మల్ని అభ్యర్థించాలనుకుంటున్నాను' అని పేర్కొంది. మహిళా ప్రయాణికుల కోసం రవాణా శాఖ 50 శాతం సీట్లను రిజర్వ్ చేయాలని కూడా కమిషన్ సూచించింది. 'రవాణా శాఖ తమ సిబ్బందికి అవగాహన కల్పించాలని బస్సు యజమానులను కోరుతుంది. బస్సులో మహిళల పట్ల వివక్ష చూపడం సరికాదు. వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి' అని అధికారి తెలిపారు.

ఒడిశా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం కార్యదర్శి దేబేంద్ర సాహు మాట్లాడుతూ మహిళలను లక్ష్మీ, కాళీ స్వరూపంగా భావిస్తాం. మహిళలు మాతృమూర్తిని సూచిస్తారు. అందువల్ల ఈ విషయంలో ఎలాంటి వివక్ష చూపకూడదని అన్నారు.

మణిపూర్ విద్యార్థులకు సాయం చేయాలి

రాష్ట్రంలోని వర్సిటీలను కోరిన ఒడిశా ప్రభుత్వం

భువనేశ్వర్ : మణిపూర్‌కు చెందిన విద్యార్థులు క్యాంపస్‌లలో ఎటువంటి సమస్యలను ఎదుర్కోకుండా, వారికి సాధ్యమైనంత ఉత్తమంగా సహాయం చేయాలని ఒడిశా ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను కోరినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. వివిధ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలోని మణిపురి విద్యార్థుల వివరాలు, ఈశాన్య రాష్ట్రంలోని ఘర్షణల నేపథ్యంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సమస్యలను పరిష్కరించడంలో సంస్థలు తీసుకుంటున్న పరిష్కార చర్యలతో కూడిన నివేదికను ఉన్నత విద్యాశాఖ గురువారం కోరింది. మణిపూర్ విద్యార్థుల ప్రాథమిక అవసరాలైన ఫైనాన్స్, ఫీజులు సమర్పించే తేదీని పొడిగించడం వంటి అంశాలను కూడా చూడాలని విశ్వవిద్యాలయాలకు ఆ లేఖలో విభాగం కోరింది. మణిపూర్ గవర్నర్ అనుసూయా ఉకే, మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషి రాష్ట్రానికి రాసిన లేఖ నేపథ్యంలో విశ్వవిద్యాలయాలకు ఈ లేఖ జారీ చేసింది. మణిపూర్‌లోని విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సహకరించాలని కోరుతూ ఒడిశా గవర్నర్ గణేషీ లాల్‌కు అనుసూయా ఉకే లేఖ రాశారు. 'విద్యార్థుల సంక్షేమం గురించి నేను చాలా ఆందోళన చెందుతున్నాను. ఈ క్లిష్ట సమయంలో, ఊహించలేని పరిస్థితుల్లో విద్యార్థులు వారి విద్యా కార్యకలాపాలలో ప్రతికూలంగా ప్రభావితం కాకుండా చూసుకోవాలని నేను కోరుకుంటున్నాను' అని ఉకే అన్నారు. చాలా మంది విద్యార్థులు ఒడిశాలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో తమ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వారి చదువుకు సంబంధించిన ఖర్చులతో పాటు వారి రోజువారీ అవసరాలను తీర్చడంలో సమస్యలను ఎదుర్కొంటున్నారు. మణిపూర్ విద్యార్థులు తమ సమస్యలను చాలా కష్టాలు లేకుండా పరిష్కరించడంలో సహాయపడాలని ఒడిశా గవర్నర్‌కు ఆమె లేఖ రాశారు. ఘర్షణల నేపథ్యంలో రాష్ట్రంలో ఇంటర్‌నెట్‌పై నిషేధం కారణంగా మణిపూర్‌లోని విద్యార్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌లను వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశానికి సమర్పించలేకపోయారని జోషి కూడా ఒడిశా ఉన్నత విద్యా కార్యదర్శికి లేఖ రాశారు. మణిపూర్‌లోని విద్యార్థులు పోస్ట్ ద్వారా దరఖాస్తులను సమర్పించడానికి అనుమతించాలని ఆయన అభ్యర్థించారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీని కూడా పొడిగించాలని కోరారు. ఈశాన్య రాష్ట్రానికి చెందిన అనేక మంది విద్యార్థులు నగరంలో వివిధ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అభ్యసిస్తున్నారు. మణిపూర్‌కు చెందిన ఒక ప్రముఖ విద్యాసంస్థలో మేనేజ్‌మెంట్ చదువుతున్న ఒక బాలిక తన ఇంటి నుంచి నెలవారీ చెల్లింపులను పొందడంలో సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. అయినప్పటికీ, ఆమె స్థానిక స్నేహితుల సహాయంతో తన చదువును కొనసాగిస్తోంది.

2న జీఎస్‌టీ మండలి సమావేశం

- పన్నుల ఆందోళనను పరిశీలిస్తుందని పెట్టుబడిదారుల ఆశ
- ఆన్ లైన్ గేమింగ్‌పై 28 శాతం పన్ను అమలుపై నిర్ణయం?

న్యూఢిల్లీ : ఎట్టకేలకు ఆన్ లైన్ గేమింగ్‌పై జీఎస్‌టీ అమలును నిర్ణయించడానికి జీఎస్‌టీ మండలి ఆగస్టు 2న సమావేశమయ్యే అవకాశం ఉంది. 28 శాతం జీఎస్‌టీ డిపాజిట్లపై విధించాలా లేదా ప్రతి గేమ్‌పై విధించాలా అనే విషయాన్ని కూడా మండలి నిర్ణయిస్తుంది. ప్రతి గేమ్‌పై 28 శాతం పన్ను విధించడం వల్ల అదే రూపాయికి పన్ను పదే పదే విధించబడుతుందని రెవెన్యూ కార్యదర్శి గురువారం అంగీకరించారు. ఫలితంగా ప్రభావవంతమైన పన్ను రేటు 50 శాతం నుంచి 70 శాతం వరకు ఉంటుంది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అంతర్జాతీయంగా విస్తరించి ఉన్న జీజీఆర్‌పై పన్ను విధించే అవకాశం లేకపోగా, డిపాజిట్లపై జీఎస్‌టీ విధిస్తారా లేదా ప్రతి గేమ్ జీఎస్‌టీ మండలి తీసుకునే నిర్ణయమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గేమ్‌పై పన్ను విధించడం పరిశ్రమపై చూపే బలహీనపరిచే ప్రభావంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. గత వారం ప్రారంభంలో 30 మందికి పైగా గ్లోబల్, భారతీయ పెట్టుబడిదారులు ప్రతి గేమ్‌పై పన్ను విధించడం వల్ల 50 శాతం నుంచి 70 శాతం ప్రభావవంతమైన పన్ను విధించబడుతుందని పేర్కొంది. ఇది ఊహించినది, కచ్చితంగా పరిశ్రమను అసమర్థంగా మారుస్తుందని ఆ పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆర్‌బీఐ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దీపాలీ పంత్ ఈ అంశంపై మాట్లాడుతూ 'జీఎస్‌టీ రేటును 18 శాతం నుంచి 28 శాతానికి పెంచడం పూర్తిగా సమంజసమని నా అభిప్రాయం. అన్నింటికంటే, వినోద రంగంతో సహా అనేక పరిశ్రమలు, ఆన్ లైన్ గేమింగ్ కంపెనీలు 28 శాతం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాయని నేను నమ్ముతాను. ఈ సమస్య జీఎస్‌టీ 28 శాతం ఏకరీతి లెవీకి సంబంధించినది కాదు. అయితే ప్లాట్‌ఫారమ్ ఫీజు లేదా కమీషన్ నుంచి ప్రతి గేమ్ పూర్తి ముఖ విలువకు విలువలో మార్పు అన్యాయంగా కనిపిస్తోంది' అని అన్నారు. 'ప్రతి గేమ్‌పై జీఎస్‌టీ విధించడం అంటే ఆన్ లైన్ గేమింగ్ పరిశ్రమపై డిపాజిట్లపై జీఎస్‌టీ విధించే కాసినోల కంటే దారుణంగా పన్ను విధించడం. ప్రతి గేమ్‌పై, గెలుపుపై పన్ను విధించడం వల్ల ఖర్చు, పన్నులు ప్రభావవంతంగా 50 నుంచి 70 శాతం వరకు పెరగవచ్చు. ఇది పరిశ్రమకు లేదా గేమర్‌లకు ఆచరణీయమైన ఎంపిక కాదు. ఇది పరిష్కరించాల్సిన సమస్య' అని తెలిపారు. ప్రతి గేమ్‌పై 28 శాతం జీఎస్‌టీ విధించడం వలన జీఎస్‌టీ బాధ్యత 1,000 శాతం కంటే ఎక్కువ పెరుగుతుంది. ఫలితంగా దాదాపు 1,000 భారతీయ గేమింగ్ స్టార్టప్‌లు, రూ.25 వేల కోట్ల ఆదాయాలతో పరిశ్రమలో 50 వేల కంటే ఎక్కువ ఉన్నత నైపుణ్యం కలిగిన ఉద్యోగాల కోసం ఉపాధిని కోల్పోయేలా చేస్తుంది. అదనంగా, భారతదేశం అంతటా 18-58 సంవత్సరాల మధ్య వయస్సు గల 40 కోట్ల మంది భారతీయ గేమర్‌లపై ఈ అదనపు పన్ను భారం పడుతుంది.

నియంత్రణ రేఖ సమీపంలో 9 కిలోల మాదకద్రవ్యాల స్వాధీనం

రజౌరీ: జమ్మూకశ్మీర్‌లోని రజౌరీ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి శుక్రవారం భద్రతా బలగాలు దాదాపు తొమ్మిది కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచరం మేరకు ఆర్మీ, పోలీసులు, బీఎస్ఎఫ్‌లు సంయుక్తంగా ఎల్‌ఓసీ సమీపంలోని నౌషేరా సబ్ డివిజన్‌లోని జంగర్ ప్రాంతంలో భారీ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమృత్‌పాల్ సింగ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో 8 కిలోల 960 గ్రాముల బరువున్న మాదకద్రవ్యాలతో కూడిన ఐదు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేర నౌషేరా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్పీ పేర్కొన్నారు. ఇంత పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాల స్వాధీనం క్రాస్ ఎల్‌ఓసీ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని సూచిస్తుంది. అయితే ఇది విఫలమైందని ఎస్పీ తెలిపారు.

ఉపాధిహామీ నిధుల్లో కోత ఎందుకు?

కేంద్రంపై పార్లమెంటరీ కమిటీ ఆగ్రహం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్నార్‌జీఏ)పథకానికి కేటాయిస్తున్న నిధుల్లో కోత విధించడంపై పార్లమెంటరీ కమిటీ కేంద్రానికి అక్షింతలు వేసింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఉపాధిహామీ నిధుల్లో కోత పెట్ట దంవల్ల గ్రామీణ ఉద్యోగ పథకం కింద జరగవలసిన పనులు అన్నింటికీ తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని పార్లమెంటరీ కమిటీ తీవ్రంగా విమర్శిం చింది. ఈ నివేదికను లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టారు. ఈ విధంగా నిధుల్లో కోత విధించడంపై ముందుగానే ఎందుకు సరైన వివరణ తమకు ఇవ్వలేదని కూడా కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారు లపై పార్లమెంటరీ కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కేటాయింపుల్లో భారీగా కోత పెట్టారు. ఈ ఏడాది కేవలం ఈ పథకం కింద పనుల నిమిత్తం రూ.60,000 కోట్లు మాత్రమే కేటాయించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ.73,000 కోట్లు ఈ పథకం కింద కేటాయించారు. గత ఏడాది సవరించిన బడ్జెట్ కింద ఇంకా ఎక్కువగానే రూ.89,400 కోట్లు ఖర్చు చేశారు. ఈ పథకం కింద నిధుల్లో గణనీయంగా కోత విధించడంపై కమిటీ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.6,231 కోట్లు బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉంచేసిన విషయంపై కూడా కమిటీ తన నివేదికలో కేంద్రాన్ని ప్రశ్నించింది. ఉపకరణాలు, మెటీరియల్ భాగాలకు సంబంధించి మరో రూ.7,616 కోట్లు కూడా ఈ ఏడాది జనవరి 25 నాటికి బకాయిలు పెట్టేశారని విమర్శించింది.

ప్రత్యేకహోదా సాధన కోసం త్వరలో చలో దిల్లీ

- ఏపీ పార్టీలు బీజేపీని దూరం పెట్టాలి
- రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రత్యేక హోదా సాధన కోసం అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకొని త్వరలో చలో దిల్లీ నిర్వహించాలని ప్రత్యేకహోదా సాధనా సమితి రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రత్యేక హోదా సాధనా సమితి అధ్వర్యంలో శుక్రవారం మేధావుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అధ్యక్షతన ఎంబీ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బీజేపీతో రాష్ట్రంలోని అధికార, విపక్షాలు దూరంగా జరగాలని, లేనిపక్షంలో వారిని కూడా రాష్ట్రానికి ద్రోహం చేసిన వారిగా గుర్తించాల్సి వస్తుందని రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ సాధన కోసం అనేకసార్లు కేంద్రమంత్రులను కలిశామన్నారు. విశాఖజోన్‌ను ఎప్పుడు విశాఖ నుంచి ప్రారంభిస్తున్నారో తేదీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తేదీ ప్రకటించకుండా నిధులు విడుదల అంటే ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. పోలవరం నిర్వాసితులు, గిరిజనులు కొండలు గుట్టలు ఎక్కుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గు లేకుండా పోయిందన్నారు. మణిపూర్ ఘటనలపై ప్రధాని సభకు రాకుండా తప్పించుకుని తిరుగుతుంటే ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయని. కానీ బీజేపీకి వైసీపీ, టీడీపీ మద్దతుగా నిలవడం దుర్మార్గమన్నారు. విభజన హామీల అమలు కోసం క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఆగస్టు 16, 17 తేదీల్లో ప్రారంభించి 15 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారయాత్ర చేయాలని సీపీఐ నిర్ణయించిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ ప్రత్యేకహోదాను గొంతు నులిమి చంపింది తొలుత చంద్రబాబేనన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ సాధ్యం కాదని, దుగరాజపట్నం అసాధ్యమని కేంద్రమంత్రి ప్రకటించినా రాష్ట్రంలో అధికార, విపక్షాలు స్పందించడం లేదన్నారు. విభజన హామీల అమలుకు టీడీపీ, వైసీపీ కృషి చేయని కారణంగా తామంతా విభజన హామీల కోసం క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు రాకుండా కేంద్రం చేసిందన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌కు ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేశారని, పునర్విభజన చట్టంలో ఉన్నప్పటికీ కేంద్రం సాధ్యం కాదని చెప్పడమంటే ప్రజలను మోసం చేయడం కాదా అని ఓబులేసు ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు(వైవీ) మాట్లాడుతూ రాష్ట్రానికి బీజేపీ ద్రోహం చేసిందన్నారు. టీడీపీ, వైసీపీ రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి బీజేపీకి దాసోహమంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో పరస్పరం కత్తులు దూసుకుంటున్న వైసీపీ, టీడీపీ...కేంద్రంలో మాత్రం బీజేపీకి పార్లమెంటులో మద్దతు ఇవ్వడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. హోదా, విభజన హామీలు అమలు చేయని బీజేపీని నిలదీయాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్, సీహెచ్ బాబూరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్, రైతు నాయకులు కేశవరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు చెన్నుపాటి వజీద్, అమరావతి దళిత బహుజన నాయకులు పోతుల బాలకోటయ్య, ఏపీ జర్నలిస్టు ఫోరం నాయకులు కృష్ణాంజనేయులు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మరమ్మతులపై ఈ నాలుగేళ్లలో ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నీటి పారుదల ప్రాజెక్టుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రాయలసీమలో ప్రాజెక్టుల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా ఉంది. కొత్తగా ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరు అందించిన దాఖలాలు లేవు. గండికోటలో నీళ్లు ఉన్నప్పటికీ కాలువలు తవ్వలేదు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు ఇచ్చే స్థితి లేదు. ఉత్తరాంధ్ర నీటి ప్రాజెక్టులకు అతీగతి లేదు. పోలవరం నిర్మాణం, నిర్వాసితుల సమస్యల పరిష్కారం ప్రశ్నార్థకమే. రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు, డ్యాములకు మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గానీ, నీటిపారుదల శాఖ గానీ పట్టించుకోవడం లేదు. గతేడాది వరదల కారణంగా కొట్టుకుపోయిన అన్నమయ్య, ఫించా ప్రాజెక్టుల పునర్నిర్మాణం ఊసే లేకపోవటం, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం గాలికొదిలేయటం ఇంతకు ముందెన్నడూ జరగలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయి. పోలవరంపై సీఎం జగన్ వైఖరి రివర్స్‌లో కనిపిస్తున్నది. కేంద్రం నుండి పోలవరానికి నిధులు రాబట్టడంలో జగన్ సర్కార్ విఫలం కావటంతో పాటు పోలవరానికి నిధులు ఇవ్వకుండా, ఎత్తు తగ్గించే కుట్రతో కేంద్ర ప్రభుత్వం నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తోంది. కేంద్రం చేస్తున్న కుట్రపూరిత యత్నాలను తిప్పి కొట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నాం' అని రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ స్థితిగతులు, మరమ్మతులు, ఖర్చు వివరాలు, అంచనా వ్యయం తదితరాలకు సంబంధించి సమగ్ర సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పోలవరానికి జగనే శని

- అహంకారంతో ప్రాజెక్టును నాశనం చేశారు
- త్వరలో ప్రాజెక్టును సందర్శిస్తా... అక్కడే నిలదీస్తా
- టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టును సీఎం జగన్ అహంకారంతో నాశనం చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన జగన్ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పోలవరం పూర్తయితే తెలుగు తల్లి ఆనందపడేదన్నారు. స్వర్ణ చతుర్భుజి స్ఫూర్తితో నదుల అనుసంధానం చేయాలని గతంలో వాజ్‌పేయికి సూచించానని చెప్పారు. సీఎంగా ప్రమాణ స్వీకారం రోజే పోలవరం పనులను నిలిపేసిన ఘనత జగన్‌కు దక్కుతుందని విమర్శించారు. 'పోలవరానికి జగనే శని. ఆ శని పోతే తప్ప ప్రాజెక్టు కల సాకారం కాదన్నారు. పోలవరం పూర్తయితే ఏపీలోని అన్ని ప్రాజెక్టులకు నీళ్లివ్వొచ్చు. 15 నెలలపాటు పోలవరం వద్ద నిర్మాణ సంస్థే లేకుండా చేశారు. కాంట్రాక్టర్‌ను మార్చొద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చెప్పినా జగన్ వినలేదు. మా హయాంలో పోలవరానికి రూ.11,537 కోట్లు ఖర్చుపెట్టాం. జగన్ కేవలం రూ.4,611 కోట్లతో సరిపెట్టారు. నాడు పోలవరం పర్యాటక ప్రాంతంగా ఉండేది. నేడు నిషేధిత ప్రాంతంగా చేశారని ఆయన ధ్వజమెత్తారు. డయాఫ్రం వాల్ వరదల వల్లే దెబ్బతిందని నిపుణుల కమిటీనే తేల్చింది. దానికి కూడా మమ్మల్నే విమర్శిస్తున్నారు. ప్రాజెక్టును చూడటానికి ఎందుకెళ్లకూడదు? అదేమైనా పాకిస్థానా? గైడ్ బండ్ కుంగడంతో పోలవరంలో ఇంకేం మిగిలింది? ఇన్ని తప్పిదాలు జరిగితే.. ఆంబోతు రంకెలేస్తారా? నిర్వాసితులకు ఎకరాకు రూ.19 లక్షలు ఇస్తామన్న హామీ మరిచారు. పరిహారం ఇవ్వకపోగా లబ్ధిదారుల జాబితా మార్చి మోసం చేశారు. పేదలను దోచుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చంద్రబాబు మండిపడ్డారు. టీడీపీ హయాంలో 45.72 మీటర్ల ఎత్తున పోలవరం నిర్మించాలనుకుంటే జగన్ 41.15 మీటర్ల ఎత్తుతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏ రాష్ట్రం కూడా ఏపీతో పోటీ పడలేదని, అవసరమైతే మిగిలిన రాష్ట్రాలకు నీళ్లిచ్చేవాళ్లమని చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాజెక్టుల్లో నీటిని నింపేసేవాళ్లమని, ఐదేళ్లు వర్షాలు రాకున్నా ఏపీకి ఇబ్బంది లేని పరిస్థితి ఉండేదన్నారు. 'నా ఆకాంక్షను... రాష్ట్ర భవిష్యత్తును' నాశనం చేశారంటూ చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 69 నదులు ఉన్నాయని, ఈ నదులను పూలుగా భావించానని, ఈ పూలను పోలవరం అనే దారంతో దండ చేయాలనుకున్నామని, ఆ దండను తెలుగు తల్లి మెడలో మణిహారంగా వేయాలనుకున్నామని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఆర్అండ్ఆర్ రాష్ట్రమే చేసుకోవాలంటే కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అరుణ్ జైట్లీతో వాదించానని, ఏ సెక్షన్ కింద, ఏ చట్టం కింద ఆర్అండ్ఆర్ ఇవ్వనంటున్నారని ప్రశ్నించానన్నారు. దీంతో గడ్కరీ, అరుణ్ జైట్లీ కూడా ఏమీ మాట్లాడలేకపోయారని, 'అదీ నా చిత్తశుద్ధి' అంటూ చంద్రబాబు వివరించారు. త్వరలో తాను ప్రాజెక్టుల వద్దకు వెళుతున్నానని, అక్కడే నిలదీస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆరోగ్య కార్యదర్శుల సమస్యల్ని పరిష్కరించాలి

రవీంద్రనాథ్, ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి సమానపనికి సమానవేతనం, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. రవీంద్రనాథ్, జి.ఓబులేసు డిమాండ్ చేశారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్(ఏఐటీయూసీ అనుబంధం) అధ్వర్యంలో శుక్రవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద ధర్నా జరిగింది. రవీంద్రనాథ్, ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో 18 వేల మంది ఆరోగ్య కార్యదర్శులుగా మహిళలు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేసేవారు అధికశాతం మహిళలేనన్నారు. మహిళలు అంటే ఓర్పు, సహనానికి మారుపేరని, అలాంటి వారి కష్టాన్ని ఈ ప్రభుత్వం పట్టించు కోవటం లేదన్నారు. వారికి ఆగ్రహం వస్తే తట్టుకోవడం కష్టమని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా వారి జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. హెల్త్ యాప్ ఓపెన్ చేస్తే 53 యాప్‌లు వస్తున్నాయని, అయితే సర్వర్లు పనిచేయకపోతే పైఅధికారులు చార్జ్‌మెమోలు ఇస్తూ వేధిస్తున్నారని విమర్శించారు. డిజిటల్ అసిస్టెంట్ పనులు వారే చేస్తున్నా...అధికారులు మాత్రం తామే చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఎంపీల జీతాలు ఇష్టానుసారం పెంచుకుం టున్నారని, సౌకర్యాలు సైతం వారికి ఎక్కువేనని, కానీ కష్టపడే వారికి ఈ ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సచివాలయ హెల్త్ సెక్రటరీలను గ్రేడ్ 3 నుంచి ఎంపీ హెచ్ఏ(ఎఫ్)గా ప్రమోట్ చేస్తూ జీవో విడుదల చేయాలని, వారిపై పనిభారం తగ్గించాల డిమాండ్ చేశారు. ఆరోగ్య కార్యదర్శికి గుర్తింపు ఉండేలా యూనిఫామ్ ఇవ్వాలన్నారు. కోవిడ్ కాలంలో బాగా పనిచేసిన ఆరోగ్య కార్యదర్శులకు ఉగాది కానుకగా రెండు ఇంక్రిమెంట్లు ఇస్తానని సీఎం జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత గొప్ప క్రీడాకారుల్లో కోహ్లీ ఒకడు: డివిలియర్స్

ముంబై: భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మైదానంలో చిరుతలా కదులుతాడన్న సంగతి తెలిసిందే. ప్రతిసారీ దూకుడే మంత్రగా ఆడే అతడు... తన 500వ మ్యాచ్‌లో శతకంతో సత్తా చాటాడు. అద్భుత ఇన్నింగ్స్‌తో సెంచరీ కొట్టిన కోహ్లీపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఏబీ డివిలియర్స్ ప్రశంసలు కురిపించాడు. కోహ్లీ ప్రపంచంలోని గొప్ప క్రీడాకారుల్లో ఒకడని అతను అన్నాడు. గెలవాలన్న కసి... ప్రతిసారి స్కోర్ చేయాలనే ఆకలి గొప్ప ఆటగాళ్లలో కనిపించే లక్షణాలని, అవన్నీ విరాట్‌లో పుష్కలంగా ఉన్నాయని డివిలియర్స్ తెలిపాడు. 'గోల్ఫ్ దిగ్గజం టైగర్ వుడ్స్, ఫుట్‌బాల్ లెజెండ్స్ క్రిస్టియానో రొనాల్డో, లియోనల్ మెస్సీ టెన్నిస్ ఆల్ టైమ్ గ్రేట్ ప్లేయర్లు రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, నొవాక్ జకోవిచ్. .. వీళ్లంతా గెలవాలనే కసితో ఆడతారన్నాడు. వీళ్లలో పోరాట స్ఫూర్తి అమోఘం. పోటీ ఏదైనా ప్రతిసారి చాంపియన్ అవ్వాలనుకుంటారు. విరాట్ కోహ్లీ కూడా అచ్చం వీళ్లలానే ప్రవర్తిస్తాడు. అంతేకాదు అతడి హృదయం చాలా అందమైనదని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు.

'బ్రో' డిజిటల్ రైట్స్ నెట్‌ఫ్లిక్స్ సొంతం



హైదరాబాద్: టాలీవుడ్‌లో పవర్ స్టార్‌గా పేరున్న పవన్ కల్యాణ్, ఆయన మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన 'బ్రో' సినిమా శుక్రవారం థియేటర్లలోకి విడుదలై హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఉదయం నుంచే పవర్ స్టార్ ఫ్యాన్స్ థియేటర్ల వద్ద పూలాభిషేకాలు, పాలాభిషేకాలతో రచ్చ రచ్చ చేశారు. ఈ చిత్రంలో పవన్, సాయి తేజ్ మధ్య వచ్చే సన్నివేశాలు అభిమానుల్ని మెప్పిస్తాయని చెబుతున్నారు. సినిమాలో మొదటి భాగం అంతా వినోదం, రెండో భాగమంతా భావోద్వేగాలతో నిండి ఉందం టున్నారు. ఈ చిత్రం వినోదయ సిత్తం అనే తమిళ్ సూపర్ హిట్ మూవీకి రీమేక్‌గా తెరకెక్కింది. కాగా ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ దక్కించుకుంది. హిట్ టాక్ తెచ్చుకున్న ఏ సినిమా అయినా ఓటీటీలోకి రావడానికి 8 వారాల సమయం పడుతుంది. దీని ప్రకారం చూస్తే ఈ సినిమా సెప్టెంబరు చివరి వారంలో స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాలో కేతిక శర్మ, ప్రియా ప్రకాష్ వారియర్ హీరోయిన్స్ గా నటించారు. ఈ చిత్రానికి తమన్ స్వరాలు సమకూర్చారు. బ్రో సినిమాకు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే అందించడంతోపాటు మాటలు కూడా రాశారు. ఈ చిత్రంలో బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రోహిణి, తనికెళ్ల భరణి, అలీ రెజా తదితరులు కీలకపాత్రల్లో నటించారు.

పపువా న్యూగినియా జట్టు సంచలనం

టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించిన పసికూన

న్యూదిల్లీ: టీ20 క్రికెట్‌లో పసికూన పపువా న్యూ గినియా జట్టు సంచలనం సృష్టించింది. వచ్చే ఏడాది టీ20 వరల్డ్ కప్ పోటీలకు క్వాలిఫై అయింది. దాంతో, వరల్డ్ కప్ బరిలో నిలిచిన 15వ జట్టు అయింది. తూర్పు ఆసియా పసిఫిక్ క్వాలిఫైయర్ పోటీలో పపువా న్యూ గినియా శుక్రవారం ఫిలిప్పీన్స్ జట్టుపై 100 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన గినియా టీమ్ 229 రన్స్ కొట్టింది. టీ20ల్లో ఆ జట్టుకు ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఆ తర్వాత ఫిలిప్పీన్స్‌ను 127 పరుగులకే కట్టడి చేసింది. న్యూ గినియా బౌలర్ కబువా మోరియా హ్యాట్రిక్‌తో సహా 5 వికెట్లతో చెలరేగాడు. దాంతో, ఆతిథ్య జట్టు 100 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. గురువారం స్కాట్లాండ్- ఐర్లాండ్ జట్లు పొట్టి ప్రపంచ కప్ పోటీలకు క్వాలిఫై అయ్యాయి. యూరోపియన్ క్వాలిఫైయర్స్‌లో మెరుగైన రన్‌రేటు ఉన్న ఈ రెండు జట్లు నేరుగా అర్హత సాధించాయి. ఇప్పటికే అన్ని ప్రధాన జట్లు ఈ పోటీలకు క్వాలిఫై అయ్యాయి. వచ్చే ఏడాది జూన్‌లో టీ20 ప్రపంచ కప్ మొదలవ్వనుంది. ఈ మెగా టోర్నీకి వెస్టిండీస్, అమెరికా సంయు క్తంగా ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే.

జపాన్ ఓపెన్ - సెమీస్‌లో లక్ష్యసేన్

టోక్యో: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత షట్లర్ లక్ష్యసేన్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్స్‌లో కొకి వతనబె (జపాన్)పై 21-15, 21-19 వరుస సెట్లలో విజయం సాధించాడు. గతేడాది జరిగిన కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్‌గా నిలిచిన లక్ష్యసేన్... ఇటీవలే కెనడా ఓపెన్ సూపర్ 500 టోర్నీ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా జపాన్ ఓపెన్‌లో ఎదురులేకుండా ముందుకు సాగుతున్నాడు. ఇక సెమీఫైనల్స్‌లో ఇండోనేశియా ఆటగాడు జొనాథన్ క్రిస్టీతో లక్ష్యసేన్ ఆడాల్సి ఉంటుంది.

నిరాశపర్చిన ప్రణయ్

మరో భారత షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్‌కు నిరాశ తప్పలేదు. టాప్ సీడ్ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) చేతిలో 19-21, 21-18, 21-8 తేడాతో ఓడిపోయాడు. తొలి సెట్‌లో ఆధిపత్యం ప్రదర్శించిన

ప్రణయ్... రెండో సెట్ ఆరంభంలోనూ దూకుడుగా ఆడాడు. అయితే, పుంజుకున్న అక్సెల్సెన్ ప్రణయ్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ విజయం సాధించాడు.

డబుల్స్ జోడీకి పరాజయం

ఇదే టోర్నీలో భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి - చిరాగ్ శెట్టి ఓటమి చవి చూశారు. చైనీస్ తైపీకి చెందిన లీ యాంగ్- వాంగ్ లిన్ చేతిలో 15-21, 25-23, 16-21 తేడాతో భారత ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి - చిరాగ్ శెట్టి ఓడిపోయారు. తొలి సెట్‌ను కోల్పోయిన తర్వాత పుంజుకున్న భారత జోడీ రెండో సెట్‌ను కష్టపడి సొంతం చేసుకుంది. ఇక కీలకమైన మూడో సెట్‌లో రెండు దేశాల షట్లర్లు తీవ్రంగా పోరాడారు. అయితే, చివరికి చైనీస్ తైపీ జోడీనే సెట్‌ను కైవసం చేసుకుని సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించింది.

4న ఓటీటీలో 'రంగబలి'

హైదరాబాద్: నాగశౌర్య హీరోగా నటించిన రంగబలి... ఓటీటీలో స్ట్రీమ్ కానుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో ఆగస్టు 4 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వచ్చేసింది. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మలయాళ నటుడు షైన్ టామ్ చాకో ప్రతినాయకుడి పాత్ర పోషించాడు. ముందు నుంచి ఈ సినిమాపై జానాల్లో మంచి ఆసక్తి నెలకొంది. ప్రమోషన్‌లు గ్రాండ్ బాగానే ప్లాన్ చేయడంతో జానాల్లో బాగానే రిజిస్టర్ అయింది. సినిమా మీదున్న నమ్మకంతో ముందు రోజు నుంచే ఈ సినిమాకు ప్రీమియర్‌లు వేశారు. పైగా నాగశౌర్య సైతం ఈ సినిమా హిట్టు, సూపర్ హిట్టు కాదు కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. అంతేకాకుండా నిర్మాతకు కూడా ఈ సినిమా బోలెడు లాభాలు తెచ్చిపెడుతుందని చెప్పాడు. తీరా ప్రీమియర్ షో చూశాక ప్రేక్షకుల స్పందన ఆశించిన స్థాయిలో రాలేదు.

వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లకు

ఈ-టికెట్‌లను అనుమతించం: బీసీసీఐ

న్యూదిల్లీ: ఐసీసీ వన్డే క్రికెట్ ప్రపంచ కప్ షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి భారత అభిమానుల్లో ఎక్కడలేని ఉత్సాహం కనిపిస్తోంది. సొంత గడ్డపై మెగా టోర్నీలో అభిమాన క్రికెటర్ల ఆట చూసేందుకు ఎంతో ఆతృతగా ఉన్నారు. ఇప్పటికే చాలామంది ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్నారు కూడా. అయితే... షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేస్తామని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) సెక్రటరీ జైషా గురువారం ప్రకటించ గానే కొందరు ఉసూరుమన్నారు. తాజాగా ఆయన మరో బాంబు పేల్చారు. ప్రపంచకప్ మ్యాచ్‌లకు ఈ టికెట్లను అనుమతించమని స్పష్టం చేశారు. అభిమానులు కచ్చితంగా టికెట్ ప్రింట్ తీసుకొని స్టేడియానికి రావాలని కోరారు. అయితే... కంగారుపడాల్సిన అవసరం లేదని, ఏడు నుంచి ఎనిమిది టికెట్ ప్రింటింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అతను తెలిపారు. ఈ ఏడాది వన్డే ప్రపంచకప్ భారత్‌లో అక్టోబర్ 5న మొదలు కానుంది. ఆరంభ పోరులో ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.